ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 03 సంచిక 01

ఫిబ్రవరి 2024



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం
4. నెలవారి పంచాంగం
5. మన దేవాలయాలు
6. శ్రీరామానుజ సుధామాధురి
8. రథసప్తమి ప్రత్యేకం
10. శ్రీపతిస్తుతి
11. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
12. వాక్య గురుపరంపర
14. జ్యోతిర్విజ్ఞానమ్
15. భరన్యాసము-భగవంతునిపై భారము
16. భాగవతంలో భగవంతుని కథలు
18. మంగళాశాసనాలు
20. శ్రీరామాయణంలో ఉపకథలు
21. అవయవ విభూతి
26. మన ఒక్క అడుగు భగవంతుని వైపు
28. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్




## ముఖచిత్ర పరిచయం

"రామా" అంటే హృదయం పులకరిస్తుంది. అయోధ్యలో నూతనంగా నిర్మితమైన ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ జరిగిన రామ్‌లల్లా చిరునవ్వులు చిందిస్తున్నారు. బాల రాముడి ముందు నిలబడితే చిరునవ్వులు చిందిస్తూ పలకరించిన అనుభూతి కలుగుతుంది. యావత్ భారతావని పులకరించి పోయేలా రామ్‌లల్లా విగ్రహాన్ని అరుణ్ యోగి రాజ్ కృష్ణశిలతో జీవం ఉట్టిపడేలా మలిచారు. 6 నెలలు కఠిన నియమ నిష్ఠలతో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండి రామ్‌లల్లా మూర్తిని రూపకల్పన చేశారు. ఆలయ నిర్మాణాన్ని అత్యాధునిక శైలితో కాకుండా ప్రాచీన శిల్పకళా రీతిలో కేవలం ప్రత్యేకమైన రాయితో నిర్మించారు. వరంగల్‌కు సమీపంలోని రామప్ప దేవాలయం నిర్మించిన తరహాలోనే ఆలయాన్ని రూపొందించి నట్టు తెలుస్తోంది. వేల సంవత్సరాలైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా చెక్కుచెదరని విధంగా ఆలయాన్ని నిర్మించడానికి ట్రస్ట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. శ్రీసన్నిధానం మాస పత్రిక మూడవ వార్షికోత్సవ ప్రత్యేక సంచికలో బాలరాముడు ముఖచిత్రంగా దర్శనం ఇస్తున్నారు.


**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు



**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

## రామ్ లాలా బాలరాముడు అయోధ్యలో కొలువు



రాముడు వచ్చాడు!... రామభక్తుల నిరంతర పోరాటాల ఫలితంగా మళ్లీ శ్రీరామచంద్ర ప్రభువు రామ్ లాలా బాలరాముడు అయోధ్యలో కొలువు తీరాడు. సుమారు 500 సంవత్సరాల భక్తుల పోరాటాల ఫలితం ఇది. ముఖ్యంగా కరసేవ అనంతరం పరిణామాలు, కోర్టు ముందు వెలుగు చూసిన వాస్తవాల వల్ల రామ జన్మభూమి అయోధ్య సత్యమని ఆ ప్రదేశాన్ని నిర్ధారించారు సెక్యులర్ ముసుగులో హిందుత్వంపై అనుక్షణం జరుగుతున్న దాడిలో భాగంగా శ్రీ రామ కథ కథనే అంటూ వాస్తవం కాదన్న వాదనకు చరమగీతం పాడే రోజు ఇది. మళ్లీ రాముడు వచ్చాడు. అయోధ్యలో కొలువుతీరాడు. ఇక రామరాజ్య స్థాపనకు అంకురార్పణ జరిగిందన్నది వాస్తవం.

చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. అద్భుత ఘట్ట సమయంలో మనం ఉన్నాం. మనమెంత అదృష్టవంతులం. రాములవారి ఆగమనాన్ని వీక్షించే అదృష్టానికి నోచుకున్నాం. కేవలం భారత జాతి కాదు విశ్వ మానవజాతి అంతా హర్షించే అద్భుత ఆవిష్కరణ ఇది. ఇది కల కాదు వాస్తవం. ప్రపంచానికి తొలి రాజధాని అయోధ్య. ఇక మనకు అయోధ్యనుంచే సుపరిపాలన రామారాజ్య స్థాపన ఈ ఆలోచన శరీరంలో ఒక ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని నింపి రేపటి రోజుకు కొత్త బాటలు వేస్తోంది. రాముడు అంటే శక్తి, పరిష్కారం. వర్తమానం, శాశ్వతం అందుకే రాజ్యాంగబద్ధంగా అయోధ్యలో మనకోసం రామ్‌లల్లా కొలువయ్యాడు. ఆ క్షణాలు భారతదేశంలో విదేశాలలో ప్రపంచంలోని రామభక్తులు ఎక్కడ ఉన్నా వారు అనుభవించిన అనుభూతి అనిర్వచనీయం. రామరాజ్యం అయోధ్య నుంచి ప్రారంభమై ప్రపంచమంతా విస్తరించింది. నేటికీ దాని మూలాలు దాదాపు అన్ని దేశాలలో సంస్కృతిలో కనిపిస్తాయి. ఇది ఎవరు కాదన్నా వాస్తవం. భారత రాజ్యాంగం ఆవిర్భవించిన తరువాత రాముడి ఉనికి కోసం దశాబ్దాలుగా అలుపెరుగని న్యాయపోరాటం చేయాల్సి వచ్చింది. అయినా రాముడు నడిచిన బాటలోనే న్యాయం సిద్ధించింది. రామ్ లల్లా ఆలయ నిర్మాణం శాంతి సహనానికి ప్రతీకగా నిలిచింది. సమాజం ఉజ్వల భవిష్యత్తు వైపు సనాతన సాంప్రదాయ సిరుల వైపు అడుగులు వేసేలా చేసింది. దీనివల్ల నూతన ఆవిష్కరణలకు నూతనోత్సాహానికి దోహదం కలిగింది. రాముడు వర్తమానమే కాదు శాశ్వతం కూడా! ప్రాణ ప్రతిష్ఠ వేళ అనుక్షణం అయోధ్యలో అడుగిడిన జనం, టీవీల ముందు మహోత్సవాన్ని వీక్షిస్తున్న భారతీయులు అందరూ అనుభవించిన అనుభూతి అనిర్వచనీయం, రాముడు వచ్చిన వేళా విశేషం ఒక్క క్షణం కనుల ముందు ఆవిష్కరించుకుంటే ప్రపంచ మానవాళిలో ఆనందం ఏదో కొత్త అనుభూతి ఆకాశం నుంచి పూల వాన కురిసిన చందం. శతాబ్దాలుగా త్యాగాలతో తపస్సులతో సాధించలేనిది రాముడు అనుకుంటేనే సుసాధ్యమైంది.

రామ జన్మభూమి స్థలంలో 1949లో జరిపిన తవ్వకాల్లో బాల రాముని విగ్రహం లభించింది. ఆనాటి నుంచి నేటి వరకు టెంట్ లోను తాత్కాలిక మండపాలలోనూ బాల రాముడు నిరంతర పూజలు అందుకుంటున్నాడు. రామ జన్మభూమి వాస్తవం అన్న కోర్టు తీర్పు ఇచ్చిన క్షణంలోనే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఏర్పాటు అయింది. ఈ క్రమంలోనే 2020 ఆగస్టు 5న రామ మందిర నిర్మాణానికి గర్భగుడి సమీపంలో భూమి పూజ జరిగింది. నేటికీ సుందరంగా సుమధురంగా కన్నుల పండుగగా రామ మందిరం ఆవిష్కృతమైంది. ఆలయ నిర్మాణం అంతా స్థపతి పర్యవేక్షణలో శిల్పులనైపుణ్యంతో సర్వాంగ సుందరంగా సాంప్రదాయ పద్ధతిలో రూపు దిద్దు కొంది. ఇక్కడ ఒక విషయాన్ని మనం చెప్పుకోవాలి. అధునాతన టెక్నాలజీ వాడకుండా కేవలం ప్రత్యేకమైన రాతి ఫలకాలతోనే ఆలయాన్ని రూపొందించడం విశేషం. దీనివల్ల వేల సంవత్సరాలైనా నిర్మాణం చెక్కుచెదరకుండా సుస్థిరంగా చిరస్థాయిగా ఉంటుందన్నది వాస్తవం. మన రాముడికి మనస్ఫూర్తిగా నిర్మించిన ఆలయం కదా మరి! రామ మందిర నిర్మాణం పూర్వాపరాలు చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించ బడతాయి. కరసేవ, కర సేవకుల సంకల్ప బలము, భారత ప్రధాని మోడీ ఆలోచన విధానమో ఏమో కానీ రామ మందిర నిర్మాణం జరిగింది. ఇందులో ఎన్నో సాంకేతిక విధానాలు సుస్పష్టం అవుతాయి. ఇవి భావితరాలకు కొత్త వెలుగు రేఖలను పంచుతాయన్న దానిలో అతిశయోక్తి లేదు. సరిగ్గా శ్రీరావనవమికి రామ్‌లల్లా మూలమూర్తి నుదుటి మీద సూర్యకాంతి పడేలా నిర్మాణం జరిగిందంటే ఆశ్చర్య కలిగించే అంశమే మరి! అందుకే మన బాల రాముడు ప్రాణ ప్రతిష్ఠానంతరం చిరునవ్వులు చిందిస్తూ నిలువెత్తుగా గంభీరంగా గర్భగుడిలో నిలుచున్నాడు మరి!

-వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

పుష్య మాసం 09-02-24 వరకు, 10-02-24 శుక్లపక్షంతో ప్రారంభమై 10-03-24 వరకు మాఘ మాసం

05-02-2024 వరకు శ్రవణ కార్తి, 06-02-24 నుండి 19-02-24 వరకు ధనిష్ఠ కార్తి, 20-02-2024 నుండి 03-03-24 వరకు శతభిషా కార్తి, **పండుగలు** : 06-02-24 సర్వేషాం ఏకాదశి, 08-02-24 మాసశివరాత్రి, 09-02-24 అమావాస్య, 12-02-24 మార్కండేయ జయంతి, 13-02-24 కుంభ సంక్రమణం, 14-02-24 వసంత పంచమి, 16-02-24 రథ సప్తమి, 20-02-24 సర్వేషాం ఏకాదశి (శ్రీవిష్ణు సహస్రనామ జయంతి) 28-02-24 సంకష్టహర చతుర్థి.

## మాస ఫలాలు

**మేషం:** ఈ నెల చాలా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు మంచి ఆదాయం పొందగలరు. ఎటువంటి కార్యాన్నైనా అవలీలగా సాధించగలరు. శుభకార్యాలకు హాజరగుట, బంధు మిత్రాదులతో సంతోషములు.

**వృషభం:** ఈ నెల అనుకూలంగా ఉంది. గత రెండు, మూడు నెలలుగా పడుచున్న ఇబ్బందులు తొలగును. ఆర్థికంగా బాగుంటుంది. ఆరోగ్య సమస్యలుండవు.

**మిథునం:** ఈ నెల పనులందు ఆలస్యం, ఏపనీ కాదు. వ్యవహారాలందు నష్టములు. ప్రతీ చిన్నవిషయానికి ఆదుర్దాపడుట, గృహమార్పులు, స్థానమార్పులు, ఆరోగ్యలాభాలు, ఊహించని సమస్యలు తలెత్తును

**కర్కాటకం:** ఈనెల అనుకూలంగా లేదు. జీవనం సమస్యగా మారును. స్థానచలనం, గృహమార్పులు తప్పవు. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు. పనులు నిలిచిపోవును.

**సింహం:** ఈనెల చేయువృత్తి వ్యాపారాలందు బాగుంటుంది. అన్నిరంగాల వారికిఅనుకూలమే. ఆరోగ్యలాభం, మిత్రుల సహకారాలు, శుభ కార్యములకు హాజరగుట, సంతానంవల్ల సౌఖ్యం.

**కన్య:** ఈ నెల బాగుంది. చేయు వృత్తివ్యాపారాలందు అన్నిరంగాల వారికి బాగుండును. వివాహాది శుభ కార్యాలు జరుగుట లేదా హాజరగుట.

**తుల:** ఈనెల అన్నివిధాలుగా బాగుండును. ధనమునకు లోటుండదు. ఆరోగ్యం బాగుండును. పనులు త్వరితగతి పూర్తి చేయగలరు. శుభకార్యములు జరుగును.

**వృశ్చికం:** ఈనెల పట్టిందల్లా బంగారమా? అనునట్లుండును. మీమాటకు ఎదురుండదు. ఆదాయం చాలా బాగుంటుంది. ధనం నిల్వచేయుదురు. గృహనిర్మాణాలు కలిసి వచ్చును. శుభకార్యాలు. నూతన కార్యాలకు శ్రీకారం చుట్టెదరు.

**ధనుస్సు:** ఈ నెల అనుకూలం. చేయు వృత్తివ్యాపారాలు అనుకూలించును. ఆదాయంనకు లోటుండదు. వ్యవహారాలు అనుకూలించును. ఆరోగ్యలాభం. ధైర్యంగా ముందుకుపోగలరు.

**మకరం:** ఈ నెలలో శ్రమ అధికం. అలసట, మానసిక ఆందోళనలు. వ్యాపారపరంగా బాగుంటుంది. అధిక ధనవ్యయం. వివాహాది శుభకార్యాలకు హాజరగుదురు

**కుంభం:** ఈ నెల అనుకూలత ఉండదు. ఆరోగ్యభంగములు తప్పవు. ఆర్థిక సమస్యలు వెంటాడును. అపనిందలు ఎదుర్కొని వలసివచ్చును.

**మీనం:** ఈ నెల అనుకూలంగా ఉండదు. మానసిక క్షోభ అనుభవించెదరు. అప్పులు చేసి అయినాకార్యాలు చేయుదురు. ఆరోగ్యభంగములు తప్పవు.

**మాఘమాసం స్నానానికి ప్రసిద్ధి. ఇహపర శుభదాయకం. సూర్యోదయం కాబోతున్న సమయంలో స్నానం చేస్తే మహాపాతకాలు పోతాయి. సూర్యోదయానికి మునుపు, వేడినీటిలోనైనా ఇంట్లో స్నానం చేసినా ఆరు సంవత్సరాల అఘమర్షణ స్నానఫలం లభిస్తుంది. ఈ పవిత్ర మాసంలో సూర్యారాధన, విష్ణ్వర్చన, శివోపాసన వంటివి విశేష ఫలాన్నిస్తాయి. సర్వదేవతలకు ప్రీతికరమైన మాసమిది. కార్తీకం దీపానికి ప్రధానం, మాఘమాసం స్నానానికి ముఖ్యం, ఈ మాసంలో దానం, జపం ఎంత విశేషంగా చేస్తే అంతమంచిది.**

## మంచి రోజులివిగో...

**ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు 11,14,18,19,21,27,28,29,30**

# అనంతశయనం శ్రీపద్మనాభస్వామి

## మన దేవాలయాలు

కరీంనగర్ జిల్లాకు 18 కి.మీ దూరంలో ఉన్న దేవంపల్లిగ్రామం లో శ్రీఅనంతపద్మనాభస్వామి వారు వెలిశారు.



పూర్వం 200 సం। క్రితం దేవంపల్లి గ్రామంలో కొంత మంది గ్రామస్థులు కట్టెలకోసం ఎడ్లబండి సహాయంతో దేవంపల్లి నుండి కొండపల్కలకు వెళ్ళే మార్గంలో ఉన్న గుట్టల దగ్గరకి వెళ్ళేవారు. అక్కడ ఉన్న ఒక చిన్న గుట్ట దగ్గరికి వెళ్ళేసరికి ఆ ఎడ్ల బండ్లు అక్కడి నుండి ముందుకు కదలక పోగా వారి ముందు నుండి ఒక పెద్ద సర్పం అక్కడ ఉన్న చిన్న గుట్టల లోపలికి వెళ్ళేది. ప్రతి రోజు ఆ సర్పం గ్రామస్థులకు గుట్టలోపలికి వెళ్తూ కనిపించేది. ఒకరోజు అనగా శుద్ధ ఫల్గుణ పౌర్ణమి రోజు ఉదయం 4 గంటలకు దేవంపల్లి గ్రామంలో ఉన్న పురోహితునికి కలలో సర్పం కనిపించి ఆ ఊరి చివర ఉన్న చిన్న గుండ్ల దగ్గర పెద్ద పుట్టలో ఉన్న ఆదిశేషువుతో పాటు విగ్రహ రూపంలో శ్రీ అనంతపద్మనాభ స్వామి వారిగా వెలిశాను అని ఆ పురోహితుని స్వప్నంలో కనిపించి చెప్పింది. ఆ పురోహితుడు



తనకు స్వప్నంలో వచ్చిన విషయం దేవంపల్లి గ్రామస్థులకు తెలియజేయగా వారు అక్కడికి వెళ్ళి చూడగా ఒక మనిషి వెళ్ళే అంత దారి మాత్రమే ఉంది. లోపలికి వెళ్ళి చూడగా ఆ పురోహితునికి కనిపించిన సర్పం పుట్టలోకి వెళ్ళింది. అలాగే పుట్ట పక్కనే పెద్ద సర్పం పై శ్రీ విష్ణుమూర్తి శ్రీఅనంతపద్మనాభస్వామి అనంతశయనం భంగిమలో కనిపించారు. శ్రీఅనంతపద్మనాభస్వామి స్వయంభువుగా వెలిసారు. దేవంపల్లి గ్రామస్తులు అందరు కలిసి ఆ ఆలయన్ని నిర్మించారు. ఇప్పటికి ఆ ఆలయం లో పెద్దపుట్ట పురోహితునికి కనిపించిన సర్పం అక్కడ ఉంది అని






గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విధంగా పుట్టతో అనంత పద్మనాభస్వామి వారి విగ్రహం వెలిసి ఉండటం దేశంలో ఎక్కడ లేదు అనేది ఈ ఆలయం యొక్క విశిష్టత. ఇక్కడ ఏకదశి నుండి శుద్ధ ఫాల్గుణ పౌర్ణమి రోజు (హోళి పండగ) వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. స్వామి వారిని దర్శించుకొని పుట్టలో పాలు పోసి స్వామివారికి అభిషేకం చేసుకుంటే కోర్కెలు తీరడమే కాకుండా సంతాన ప్రాప్తి కలుగుతుందని ప్రజల నమ్మకం. ఈ దేవాలయం నిర్మించినప్పటి నుండి కలకుంట్ల వారి వంశస్థులు అయిన కీ.శే.కలకుంట్ల రామానుజాచార్యులు, కీ.శే.కలకుంట్ల శ్రీమాన్నారాయణాచార్యుల అధ్వర్యంలో స్వామి వారి యొక్క పూజా కైంకర్యములు నిర్వహించబడేవి. నేటికీ కీ.శే. శ్రీమాన్నారాయణాచార్యుల వారి యొక్క కుమారుడైన కలకుంట్ల రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి యొక్క నిత్య పూజా కైంకర్యాలు జరపబడుతున్నాయి.

## ఉడయవర్ల హృదయ మార్దవం

**- శ్రీమతి సముద్రాల శారద**

లౌకికం అయినా అలౌకికం అయినా దేనికైనా లౌకిక ప్రమాణాలు గోచరిస్తేనే అది సత్యమని అందరూ నమ్ముతారు. సత్యం స్పష్టమైనప్పుడే ఆధ్యాత్మిక భావాలకు కూడా సత్త్వము, శక్తి పెరుగుతాయి. ఇది నేటి ఆధునిక మేథస్సు. ఒక్కొక్కసారి మానవుని సంకల్పబలం, భగవత్ అనుకూలత రెండు ఏకమైనప్పుడు కలిగే పరిణామం అన్నింటికి అతీతమై ఆశ్చర్య చకితులను చేస్తుంది. మానవ మేథస్సుకు అందని గొప్ప వేద ప్రామాణ్యం గల జగత్కారణభూతం, జగదాధారమైనదే భగవత్ తత్వం!



అటువంటి సనాతన ధర్మాన్ని విశ్వసించే భారత జాతి యొక్క సంకల్ప బలానికి,భగవద్భక్తికి నిదర్శనంగా నిలిచింది నేటి శ్రీరామ జన్మభూమి వైభవం! ఆధ్యాత్మిక విశ్వాసాలకు తార్కాణంగా నిలిచింది ఆలయ నిర్మాణం! విజ్ఞాన పరిమితి ఎంత పెరిగినా అపరిమితమైన భగవత్ తత్వజ్ఞాన సంపదయే భారతీయ సంస్కృతికి మూలధనము. చరిత్రలో ప్రతిసారి కారణజన్ములను నిమిత్తంగా చేసుకుని వేద ధర్మం పునరుద్ధరింపబడుతుంది. భగవంతుని ఉనికి, ఈ ప్రపంచానికి భగవంతునితో గల సంబంధం నిరూపించ బడుతుంది. ఆ విధంగానే మారే కాలానుగుణంగా సకల జనహితైషిగా ధర్మమూలాలు చెక్కుచెదరకుండా సంస్కృతిని సంపన్నవంతం చేసిన వారే గొప్ప ఆచార్యులు. అటువంటి జగదాచార్యులు భగవత్ రామానుజాచార్యులు కారణజన్ములు యుగపురుషులు కూడా!

సమాజంలో అందరినీ ఉద్ధరించాలని దయా హృదయంతో పరితపించిన వారే భగవద్ రామానుజాచార్యులు. ఈ ప్రపంచమంతా భగవత్ శరీరమైనప్పుడు భగవంతుని పొందడానికి అందరూ యోగ్యులే కనుక వారి వారి స్థాన నియమాన్ననుసరించి వేదోక్త రీతిగా వారనుసరించేలా అనేక అనుష్ఠాన మార్గాలనుపదేశించారు. సంస్కరణలను చేపట్టారు.

ఆ సంస్కరణల్లో ఆధ్యాత్మిక సామాజిక సంస్కరణలే కాకుండా దేవాలయ నిర్వాహణ, నిర్మాణ కైంకర్య కార్యక్రమాలు మరింత ప్రధానమైనవి.

అనేక దివ్య దేశాల్లో ఆగమోక్త ఆరాధనా విధులతోపాటు భగవత్కైంకర్య పరులైన వారి భక్తికి గుర్తుగా తరతరాలు అనుసరించేలా ఆ దేవాలయాల్లో ఆచార విధానాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క చోట వారి దేహ సంబంధీకులైన వంశీయుల ద్వారా కొన్ని పవిత్ర సేవలను వారే నిర్వహించే ఏర్పాట్లు చేశారు.

ఇప్పటికీ ఆ సేవలు కొనసాగుతున్నాయంటే అవి భగవద్ ప్రీతికరములు అని వేరే చెప్పనవసరం లేదు. ఈ విశేషాలకు మచ్చుకగా నిత్య వైభవంతో వెలిగే శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన తిరుమల సమయాచారములలోనే గమనించవచ్చు.

సుప్రభాత వేళ సన్నిధి గొల్లలు, అర్చక స్వాములు, అధికారులు వెంటరాగా పరంపరాగత సాంప్రదాయ సిద్ధంగా ఆలయ ప్రధాన ద్వారాన్ని తెరుస్తారు. దేవాలయ ప్రధాన ద్వారానికి ఎదురుగుండా నిర్మింపబడిన గొల్ల మంటపం ప్రసిద్ధమైనది. గోపకులకు (గొల్లలకు) భగవంతునికి గల అనుబంధం ద్వాపర యుగం నాటిదట! పురాణ కథానుసారంగా శ్రీవెంకటేశ్వర అవతారంలో పుట్ట నుండి బయటకు వచ్చిన స్వామి గొల్లను అనుగ్రహించిన వృత్తాంతం ప్రాచుర్యంలో ఉంది.

ప్రతి గురువారం శ్రీనివాస పెరమాళ్ళకు ఆభరణాలు పీతాంబరం పుష్ప మాలికలు సడలించి గోపాలకుని అలంకరణను పోలినట్టు తెల్లని ధోతి, మెడలో కంటె ఆభరణం, నుదుటిపై సన్నని నామం ధరింప చేస్తారు. గోదాదేవి భక్తికి గుర్తుగా సకల వైష్ణవాలయాల్లో ఎన్నో ఆరాధనా విధులు నిర్వహిస్తారు. ఆళ్వార్ల పరమభక్తికి గుర్తుగా

# శ్రీరామానుజ సుధామాధురి

ఎన్నో ఉత్సవాలు ఏర్పాటు చేశారు. ఇటువంటి ఎన్నో పవిత్రమైన ఆచారాలు కన్నుల పండుగగా భక్తి భావనాపూర్ణంగా చేసే విశేష ఆరాధనలు భగవద్ రామానుజాచార్యులే ఏర్పాటు చేశారు

భగవద్రామానుజాచార్యులు తిరుమలలో ఏర్పాటుచేసిన అనంతాళ్వార్ల పుష్ప కైంకర్య వృత్తాంతం ఎంతో ప్రసిద్ధమైనది. ఆలయ సమయాచారాలపై నాటినుండి వచ్చిన గ్రంథాలలో భగవద్రామానుజాచార్యులు ఏర్పరచిన ఆలయ ఆచరణలు ఎంతో గొప్పగా వివరించి ఉండవచ్చును. లేదా విలువైన సమాచారాలు మరుగుపరిచి కూడా ఉండవచ్చును. కానీ పరంపరాగత ఆలయ నిర్వహణ, ఆగమోక్త విధానాలు, ఆరాధనా విధులు, సేవలలో భగవద్రామానుజాచార్యుల నిర్వాహక శైలి ప్రకాశిస్తూనే ఉంటుంది. సాంప్రదాయాన్ని సుప్రతిష్ఠితం చేసిన తీరు వెలుగు లీను తూనే ఉంటుంది.

భగవద్ రామానుజాచార్యులు సహస్ర ఫణి భూషితులగు ఆదిశేషుల అవతారంగా పెద్దలు కీర్తిస్తారు. ఆ విధంగానే వారు శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని సహస్ర ముఖాలుగా తేజోవంతం చేశారు. కుల వర్గ జాతి భేదాలు లేకుండా ముఖ్యంగా స్త్రీలు కూడా మోక్షగాములే నని వారూ ఉజ్జీవించవచ్చునని ఆధ్యాత్మిక మార్గాన్ని ఏర్పరిచారు. "ఐహికం పార లౌకికం" అని ఈ లోక పరలోక ఐశ్వర్యాలను ఉభయ విభూతులు అంటారు. **"అస్యా మమ శేషం హి విభూతి రుభయాత్మికా"** అని భగవంతునికి గల ఐశ్వర్యం నిత్య లీలా విభూతులు. చేతనులను ఉద్ధరించడానికి కలియుగారంభంలో నమ్మాళ్వార్లను అవతరింప చేశారని వారు పరవపదం విడిచి ఉండలేక తక్కువ కాలం భూమి పైన ఉండడం వలన ఆదిశేషులను భగవద్ రామానుజులుగా అవతరింప చేశారని, ఉభయైశ్వర్యాలను ప్రసాదించగలిగే ఉపదేశ మార్గాన్ని చూపించిన ఉత్తారకాచార్యులు భగవద్ రామానుజాచార్యులు అని పెద్దలు సమన్వయం చేస్తారు. వారే ఉభయ విభూతులను ప్రసాదించే నాయకులని భగవద్ ఆజ్ఞ అయినందున భగవద్ రామానుజాచార్యులు ఉడయవర్లు అయినారు.

అలా యతి రాజులు తిరుపతిలో గొల్లకు మోక్షమిచ్చిన వృత్తాంతము వారి దయా హృదయానికి నిదర్శనం. తిరుమలలో జగదాచార్యులు ఉత్సవాలకు అనువైన రీతిలో మాడవీధుల నిర్మాణం గావించారు. విష్వక్సేనాది అనేక పరివార దేవతలను వారే ప్రతిష్ఠింపజేసినట్లు చరిత్ర చెబుతున్నది. వీరశైవుడైన చోళరాజు తన అధీనంలోని చిదంబరంలో గల గోవిందరాజస్వామి మూలమూర్తిని దేవాలయాన్ని ధ్వంసం చేయ తలపెట్టాడు. ఆ సమయంలో భగవద్ రామానుజాచార్యులు చేసిన సాహసం మహత్తరమైనది. అక్కడి ఉత్సవమూర్తులను తిరుపతికి తరలించారు. ఆ ఉత్సవ మూర్తుల తరలింపులో విష్ణు భక్తురాలైన "రాజ నర్తకి తిల్ల" రాజు దృష్టిని మళ్లించి సహకరించింది. ఆమె కైంకర్యానికి గుర్తుగా తిల్ల గోవిందరాజులుగా పేరిడి శ్రీ భూ సమేతులుగా స్వామిని ప్రతిష్ఠించారు. యాదవ రాజుల సహకారంతో దేవాలయ నిర్మాణంతో పాటు తిరుపతిలో ఉత్సవ వీధులు, కూటాలు, అర్చక నిలయాలు, అనేక కట్టడాలు నిర్మించారని స్థల చరిత్ర చెబుతున్నది. నేటికీ ఆ వీధిని రామానుజ వీధిగా పిలుస్తారు.

ఆ క్రమంలోనే తిరుమలలో కూడా ఉత్సవాలకు అనువైన రీతిలో మాడవీధుల నిర్మాణంగావించారు. ఈ నిర్మాణ కార్యక్రమాల్లో శిష్య బృందముతో పాటు ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తూ వారు అక్కడే నివాసం ఉన్నారు. ఆ సమయంలో "తుంబియార్కొండి" అను గొల్ల వనిత వారి తదియారాధనకు పాలు పెరుగు సమకూర్చుతుండేది. కొద్ది రోజుల తర్వాత ఆమె తనకు కావలసిన ధనాన్ని ఇప్పించాల్సిందని కోరిందట! కానీ నిత్యం తీర్థ ప్రసాదాలు స్వీకరించే తుంబియార్కొండికి స్పర్శ వేది ప్రభావంతో ఇనుము బంగారంగా మారినట్లు ఆచార్య తీర్థ ప్రభావంతో జ్ఞానాన్ని పొందింది. నిర్మాణ సమయంలో ఎందరికో క్షీర కైంకర్యంతో సేదతీర్చే తుంబియార్కొండి ఒకనాడు ఆచార్యుల వద్దకు వెళ్లి "స్వామి! మీకు వెంకటేశ్వర స్వామికి చాలా దగ్గర కదా మీరు భగవంతునితో మాట్లాడతారు కదా భగవంతునికి చెప్పి నాకు వైకుంఠాన్ని మోక్షాన్ని ఇప్పించండి!" అని కోరిందట! జగదాచార్యులు అనుగ్రహించి ఒక శ్రీ ముఖాన్ని పత్రంపై స్వహస్తదస్తురీతో ఈ విధంగా వ్రాసారట!( భగవద్ రామానుజ చరిత్ర లోని లేఖ)

శ్రీమతే పూర్ణ గురుభ్యోనమః మకాం తిరుపతి

శ్రీ లక్ష్మీ నాయకా! వైకుంఠ వాసా! అవాప్త సమస్త కామా! నిత్య ముక్తానుభవ్యా! శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా! నిఖిల చరాచరాధీశా! (మిగతా 17 వ పేజీలో)



# రథ సప్తమి
## సూర్య ఆరాధన

ప్రత్యేకం

**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి, స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**

శ్రీరామాయ నమః
శ్రీమతే రామానుజాయ నమః

మాఘ మాస శుక్ల పక్ష సప్తమికి రథ సప్తమి అని పేరు. రథ సప్తమి నాడు 'సూర్య ఆరాధన' సద్యః ఫలప్రదము, మాఘ మాసమంతా సూర్యుని అరాధించుట, అరుణోదయమున స్నాన మాచరించుట పుణ్య ప్రదమని శాస్త్రముల వచనము.

సూర్యుడు ప్రత్యక్ష దైవము. **'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్'** అన్నట్లు భాస్కరుడైన సూర్యుని ఆరాధించుట వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుంది. సనాతనమైన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను అనుసరించే వారు తప్పక నిత్యం సూర్యునికి మూడు కాలాలోనూ అర్ఘ్యాన్ని సమర్పిస్తారు. అత్యంత శక్తి వంతమైన 'గాయత్రీ' మన్త్రం సూర్య సంబంధమైనదే. సూర్యోదయం కాకపోతే జీవుల జీవనమే ప్రశ్నార్థకమౌతుంది. అట్టి ప్రభావం గల సూర్యుని ఆరాధించుటకు తగిన మాసం, మాఘ మాసం.

ఈ మాసంలోనే 'శివరాత్రి' కూడా వస్తుంది. మాఘ బహుళ చతుర్దశి నాడు 'శివరాత్రి' పండుగను జరుపుకుంటారు. స్కాంద పురాణంలో,

**మాఘ మాసస్య శేషీ యా ప్రథమే ఫాల్గుణస్యచ।**
**కృష్ణా చతుర్దశీ సా తు శివరాత్రిః ప్రకీర్తితా॥**

"మాఘమాసము చివరి రోజున, ఫాల్గుణ మాసము ప్రారంభానికి ముందు రోజున అనగా మాఘ కృష్ణ చతుర్దశి 'శివరాత్రి' అని చెప్పబడుతున్నది." అని ఉన్నది. ఈనాడు ఉపాసించుట ప్రధానమైన విధి. స్కాందపురాణంలో

**నస్నానే న నవస్త్రేణ న ధూపేన న చార్చయా।**
**తుష్యామి న తథా పుష్పైః యథా తత్రోపవాసతః॥**

"అభిషేకముగాని, వస్త్ర సమర్పణము గాని, ధూపముగాని, అర్చనము గాని, పుష్ప సమర్పణము గాని నాకు సంతోషము కలిగించదు. ఉపవాసము మాత్రమే నాకు మిక్కిలి సంతోషమును కలిగిస్తుంది" అని శంకరవచనము. ఆశు తోషుడైన శివుడు లింగముగా ఉద్భవించిన మహిమాన్విత మైన మాసము ఈ మాఘము. అయితే 'శివరాత్రి" బహుళంలో వస్తుంది. ఫాల్గుణ మాసానికి ముందు రోజు వస్తుంది. కావున ఈ మాఘ మాసం, శుక్ల సప్తమి యైన రథసప్తమి నాడు సూర్యారాధనకు ప్రాధాన్యం కల మాసం. అంతే కాక ఈ మాసంలో స్నానానికి విశేషం.

**సితాసితే తు యస్స్నానం మాఘమాసే యుధిష్ఠిర।**
**న తేషాం పునరావృత్తిః కల్పకోటి శతైరపి॥**
**కురుక్షేత్ర సమా గంగా యత్ర కుత్రావగాహితా।**
**తస్మాద్దశగుణాం వింధ్యే కాశ్యాం శతగుణా తతః॥**
**కాశ్యా శ్శత గుణా ప్రోక్తా గంగా యమునయాన్వితా।**
**సహస్ర గుణితా సాపి మాఘే పశ్చిమ వాహినీ॥**



గంగా యమునా నదుల సంగమ స్థలమున మాఘ మాసమందు స్నానము చేయువారికి కోటి కల్పములకైనను జన్మ బంధము లేదు. గంగా నదిలో ఎక్కడ స్నానం చేసినా కురుక్షేత్రములో స్నానము చేయుటతో సమానము. వింధ్య వాసినీ గంగయందు పదిరెట్లు పుణ్యము. కాశీలో నూరు రెట్లు పుణ్యము. కాశీ కంటే గంగా యమునా సంగమమున నూరు రెట్లు పుణ్యము లభించును.

మాఘ శుక్ల సప్తమి (రథసప్తమి) యందు అరుణోదయ స్నానము చేయవలెను. స్నానము చేసేటప్పుడు,

**యదా జన్మకృతం పాపం మయా జన్మసు జన్మసు।**
**తన్మే రోగం చ శోకం చ మాకరీ హంతు సప్తమీ॥**
**ఏత జ్జన్మ కృతం పాపం యచ్చ జన్మాంతరార్జితం।**
**మనో వాక్కాయజం యచ్చ జ్ఞాతాజ్ఞాతేచయే పునః॥**
**ఇతి సప్తవిధం పాపం స్నానాన్మే సప్త సప్తికే।**
**సప్త వ్యాధి సమాయుక్తం హర మాకరి సప్తమీ॥**

"జన్మ జన్మాంతరములందు చేసిన శోక రూపమగు నా

పాపమంతయూ మకర సప్తమి హరించు గాక! ఓ సూర్య ప్రియమైన మకర సప్తమి! ఈ జన్మలోను జన్మాంతరమందు మనోవాక్కాయములచే జ్ఞానా జ్ఞానములతో చేసిన సప్తవిధ పాపము, సప్త వ్యాధి రూపము ఈ స్నానముచే దానిని నశింపజేయుము. అంటూ ఈ మన్త్ర పఠనము చేస్తూ స్నానము చేయవలెను. స్నానము చేసిన పిమ్మట సూర్యునికి అర్ఘ్యమును సమర్పించవలెను. అర్ఘ్య మిచ్చేటప్పుడు,

**సప్త సప్తి వహ ప్రీత సప్తలోక ప్రదీపన।**
**సప్తమి సహితో దేవ గృహాణార్ఘ్యం దివాకర॥**

**'సప్తాశ్వరథమారూఢం'** అన్నట్లుగా ఏడు గుఱ్ఱములు పూన్చిన రథమని గానీ, లేదా 'సప్త' అను పేరు గల ఒకే గుఱ్ఱము పూన్చిన రథమని గానీ సూర్యరథము విషయంలో అర్థము చెప్పవచ్చు. అనగా, **"ఏకో అశ్వోవహతి సప్తనామా"** అను అరుణ పాఠము ననుసరించి సూర్యుని రథాశ్వమునకు 'సప్త' అను పేరు. కనుక 'సప్త' అను పేరుగల ఒకే అశ్వము పూన్చిన రథము సూర్యునిది. ఇది ఒక అర్థమైతే, ఇతర ప్రమాణములను అనుసరించి ఏడు గుఱ్ఱములు వహించు రథము కలవాడు సూర్యుడని కూడా అర్థము చేసుకోవచ్చు, కావున, "సప్తాశ్వ రథుడవైన ఓ సూర్యుడా! సప్త లోకములను ప్రకాశింప చేయుచూ సప్తమీ యుక్తుడవై నా అర్ఘ్యమును స్వీకరింపుము". ఈ రథసప్తమినే మన్వాదిగా కూడా పరిగణిస్తారు. సూర్యునికి ఈ విధంగా అర్ఘ్యమును సమర్పించిన తర్వాత వేదాధ్యయనము చేసినవారు, 'సౌరము' 'అరుణము' అను మన్త్ర భాగమును అనుష్ఠానము చేసుకోవలెను. అయితే ఇది వేదాధ్యయనము చేసిన యోగ్యులకు మాత్రమే అనుష్ఠింప దగినది.

**శ్రీరామాయణాంతర్గతమైన 'ఆదిత్య హృదయ' పారాయణము. ఈ స్తోత్రము మిక్కిలి మహిమ గలది. శ్రీరామ రావణ యుద్ధ సమయంలో అగస్త్య మహర్షి శ్రీరామునికి ఉపదేశించినది. ఈ ఆదిత్య హృదయమును జపించియే శ్రీరాముడు రావణుని సంహరించాడు.**

**ఇది అందరూ అనుష్ఠింపదగినది.**

**మాఘ మాసమంతా 'సూర్య ఆరాధన' ఫలప్రదము.**

ఇక అందరూ అనుష్ఠింపదగినది శ్రీరామాయణాంతర్గత మైన 'ఆదిత్య హృదయ' పారాయణము. ఈ స్తోత్రము మిక్కిలి మహిమ గలది. శ్రీరామ రావణ యుద్ధ సమయంలో అగస్త్య మహర్షి శ్రీరామునికి ఉపదేశించినది. ఈ ఆదిత్య హృదయమును జపించియే శ్రీరాముడు రావణుని సంహరించాడు.

స్తోత్రారంభంలో అగస్త్యుడు,

రామ రామ మహాబాహో శ్రుణు గుహ్యం సనాతనమ్।
యేన సర్వానరీన్ వత్స సమరే విజయిష్యసి॥
ఆదిత్యహృదయం పుణ్యం సర్వ శత్రు వినాశనమ్।
జయావహం జపేన్నిత్యం అక్షయ్యం పరమం శుభమ్॥
సర్వమంగళ మాంగళ్యం సర్వపాప ప్రణాశనమ్।
చింతా శోక ప్రశమనం ఆయుర్వర్ధన ముత్తమమ్॥
రశ్మిమంతం సముద్యంతం దేవాసుర నమస్కృతమ్।
పూజయస్వ వివస్వన్తం భాస్కరం భువనేశ్వరమ్॥


"ఓ భుజబల శాలియగు రామా! సనాతనమైన రహస్యాన్ని నీకు ఉపదేశిస్తాను వినుము. దీనిని నీవు జపించుట వల్ల సమరంలో శత్రువులపై నీకు విజయము సిద్ధించును.

పుణ్యప్రదము, సర్వ శత్రు వినాశకము, జయావహము, పరమ శుభకరము, అక్షయ్యము అయిన ఆదిత్య హృదయమును నిత్యము జపింపుము. ఈ స్తోత్రము సర్వమంగళములకంటే మంగళము, సర్వపాప ప్రణాశకము, చింతా శోకములను శమింప చేసి, ఆయువును వృద్ధి పొందించు ఉత్తమ మైనది. సూర్యోదయ సమయమున ప్రకాశమానుడగు దేవాసుర నమస్కృతుడైన, లోకేశ్వరుడైన భాస్కరుని పూజింపుము" అని శ్రీరామునికి ఆద్యిత హృదయ స్తోత్రాన్ని ఉపదేశించాడు.

మాఘ మాసమంతా సూర్య ఆరాధనకు ఉత్తమమైనది. సూర్యోదయాత్పూర్వమే చక్కగా స్నానం చేసి మాఘమాస మంతా ప్రతి రోజూ ఆదిత్య హృదయమును పారాయణ చేయటం వల్ల ఆయురారోగ్యములు త్వరితగతిన సిద్ధిస్తాయి. విశేషంగా రథసప్తమి నాడు సూర్యారాధన శీఘ్ర ఫలప్రదము. ఈ మాసం పదహారవ తేదీన రథసప్తమి నాడు చక్కగా సూర్యారాధన చేసి ప్రత్యక్ష దైవమైన సూర్యుని అనుగ్రహంతో ఆయురారోగ్య ఐశ్వర్యములను పొందుదాము. ★

# శ్రీపతి స్తుతి

# సుభాషితం
## మంచి మాట



శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు

ప్రాతర్నిత్యానుసంధానంలో
'పంచాయుధ స్తోత్రము'

**శ్లో॥ వనే రణే శత్రు జలాగ్నిమధ్యే**
**యదృచ్ఛయాపత్సు మహాభయేషు।**
**ఇదం పఠంస్తోత్ర మనాకులాత్మా**
**సుఖీ భవేత్ తత్కృతసర్వరక్షః॥**

ప్రతిపదార్థం:- వనే = అడవియందు, రణే = యుద్ధరంగమందు, శత్రు = శతృవుల మధ్య, జల = నీటిలో మునిగిపోవునప్పుడు, అగ్ని = అగ్ని యొక్క, మధ్యే = మధ్యయందు, యదృచ్ఛయాపత్సు = తలవని తలంపుగా వచ్చిన ఆపదలందుగాని, మహాభయేషు = గొప్ప భయములో చిక్కుకున్నవాడు, ఇదం స్తోత్రం = ఈ స్తోత్రమును, అనాకులాత్మా = ఆ ఆయుధము లందే మనస్సును నిలిపి, పఠన్ = చదివిన వాడగుచు, తత్కృత సర్వరక్షః = ఆ ఆయుధముల చేత అన్నివిధముల రక్షణ గలవాడై, సుఖీ భవేత్ = సుఖము గలవాడై అగును.

తాత్పర్యం: ఎల్లప్పుడు చదవక పోయినా అడవులలో తిరిగి నప్పుడు, యుద్ధరంగంలో చిక్కు కున్నప్పుడు, శతృవులు చుట్టు ముట్టినప్పుడు, నీళ్ళలో మునిగిపోయి కొట్టుకొని పోవునప్పుడు చుట్టు మంటలు వ్యాపించినప్పుడు, హఠాత్తుగా ఆపదలు సంభవించి నప్పుడు, గొప్ప భయాందోళనలు కలిగినప్పుడు మనసును ఆయుధములందే నిలిపి ఈ పంచమహాయుధ స్తోత్రమును పఠించినచో ఆయుధములు వీనికి అన్ని విధములుగా రక్షణనిచ్చి సుఖం కలిగించి యుండును.

**శ్లో॥ సశంఖచక్రం సగదాసి శార్ఙ్గం**
**పీతాంబరం కౌస్తుభవత్సచిహ్నమ్।**
**శ్రియా సమేతోజ్జ్వలశోభితాంగం**
**విష్ణుం సదాహం శరణం ప్రపద్యే॥**

ప్రతిపదార్థం:- స శంఖ చక్రం = శంఖ చక్రములతో గూడిన, స గదాసి శార్ఙ్గం = గద, ఖడ్గము, ధనుస్సుతో గూడిన, పీతాంబరం = పసుపు వన్నె వస్త్రమును ధరించిన, కౌస్తుభ = కౌస్తుభమనే పేరుగల మాణిక్యమును, వత్స = 'శ్రీవత్సం ' అనే పుట్టు మచ్చనే, చిహ్నం = గుర్తులు గా గలిగిన, శ్రియా = శ్రీమహాలక్ష్మీదేవితో, సమేత = కూడిక చేత, ఉజ్జ్వలశోభిత = మిక్కిలిగా ప్రకాశించుచున్న, అంగం = దివ్య మంగళ విగ్రహ విశిష్టుడైన, విష్ణుం = శ్రీమహా విష్ణువును, అహం = నేను, సదా = ఎల్లప్పుడు, శరణం = రక్షకుడని, ప్రపద్యే = శరణాగతి చేయుచున్నాను.

తాత్పర్యం: ఈ శ్లోకంలో శ్రీమహావిష్ణువును మన ముందుంచుతూ ఎట్టి వానిని మనం శరణు వేడాలో తెలిపేటి గొప్పదనం వుంది. శ్రీమన్నారాయణుడు ఈ పంచ మహాయుధాలు గలవాడు, పీతాంబరమును ధరించినవారు, వక్షస్థలంలో కౌస్తుభమణి, శ్రీవత్సమనే పుట్టుమచ్చ గలవాడు. విశేషించి లక్ష్మీదేవితో కూడియుండుటచే దేదీప్యమానంగా వెలుగొందుచు దివ్య మంగళ విగ్రహంతో 'పుంసాంమోహన రూపాయ' అన్నట్టుగా, 'సాక్షాన్మన్మథ మన్మదః' అన్నట్లుగా వుంటాడు పరమాత్మ. 'అప్రమేయంహి తత్తేజః యస్యసాజనకాత్మజా' అని రామయణంలో మారీచుడన్నట్లు గొప్ప కాంతితో విరాజిల్లు స్వామిని నేను ఎల్లప్పుడు శరణాగతి చేయుచున్నాను. ఇదియే ప్రధానమైనది. ఈ శరణాగతికి మించిన దేదియు లేదని శ్రీకృష్ణుడు తన గీతలో చివరిగా అర్జునకు ఉపదేశించిన పరమ రహస్యము, అందరు తప్పక ఆచరింతురు గాక.

**శ్లో॥ జలే రక్షతు వారాహః, స్థలే రక్షతు వామనః।**
**అటవ్యాం నారసింహశ్చ సర్వతః పాతు కేశవః॥**

ప్రతిపదార్థం: వారాహః = వరాహరూపుడైన స్వామి, జలే = నీటిలో మునిగి పోతున్న నన్ను, రక్షతు = రక్షించు గాక, స్థలే = భూమిమీద ఆపదలో చిక్కుకున్నప్పుడు, వామనః = వామనమూర్తి, రక్షతు = రక్షించుగాక, అటవ్యాం = అడవిలో ఆపదలో చిక్కుకున్న నన్ను, నారసింహశ్చ = నృసింహ స్వామి(రక్షించుగాక), కేశవః = కేశవుడు. సర్వతః = అన్నివైపుల నుండి, పాతు = కాపాడుచుండుగాక.

(మరికొన్ని విశేషాలు వచ్చే సంచికలో)






శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

శ్రీమతే రామానుజాయనమః

**శ్లో।। మస్తకే పంచలాభాయ ముఖే త్రీణి ధనక్షయః।**
**కుక్షౌ పంచ ధనం ధాన్యం షట్పాదే స్త్రీ దరిద్రతా।।**
**పృష్ఠే చైకం పాద హాని ర్నాభౌ చత్వారి సంపదః।**
**గుహ్యే చైకం భయం పీడా హస్తే చైకం తు క్రందనం।।**
**వామే చైకం కరే ఖేదో గ్రామ చక్రం నరాకృతిః।**
**గణయేజ్జన్మ నక్షత్రం గ్రామ నక్షత్రతస్సదా।।**

మనుష్యాకారముగ ఒక ఆకారమును వ్రాసి అందులో నివాసము చేయనున్న వారికి గ్రామ నక్షత్రము మొదలు శిరస్సున 5 నక్షత్రములు ముఖ మందు 3 నక్షత్రములు వీపునందు ఒక నక్షత్రము, దక్షిణ హస్తము ఒక నక్షత్రము, వామ హస్తమున ఒక నక్షత్రము వ్రాయవలయును. ఈ ప్రకారము వ్రాసిన తదుపరి అందులో తన జన్మ నక్షత్రమున్న అవయవము ననుసరించి ఫలములు తెలిసికొనవలయును. **తెలుసుకొను విధానము:** శిరస్సున యున్నచో ధనలాభము, ముఖమందున్న ధనక్షయము, కుక్షియందున్న ధనధాన్యప్రాప్తి, పాదముల యందున్న ఐశ్వర్యము, గుహ్యప్రదేశమందున్న భయము పీడయు, దక్షిణహస్త మందున్న వామహస్త మందున్న దుఃఖములు కలుగును.

**భూమి జీవితాది జ్ఞానము :-**

**శ్లో।। గ్రామాక్షరం చతుర్గుణ్యం నామాక్షర సమన్వితం।**
**శివనేత్రైహరేర్భాగం శేషాంకే ఫలమాదిశేత్।।**
**ఏకేన జీవితాభూమి ద్వితీయే సమతాఫలం।**
**తృతీయేన మృతాభూమి రిత్యుక్తం రుద్రయామిళే।।**

గృహమును నిర్మించుకొను యజమాని (గృహ నిర్మాత) గృహమును నిర్మించనున్న గ్రామముయొక్క వర్ణ(అక్షర)ము లెన్ని ఉన్నవో లెక్కించి ఆసంఖ్యను 4చే గుణించి అందు గృహకర్త నామాక్షర సంఖ్యను చేర్చి 3 చే భాగింపగా మిగిలిన శేషము ననుసరించి ఫలమును చెప్పవలయును. (స్వీకరించవలయును). శేషము 1 అయిన జీవభూమి యనియు 2 శేషమైన సమభూమి యనియు 3 శేషమైన మృత భూమి యనియు తెలిసికొనవలయును.

**శ్లో।। గ్రామనామదిశాం వర్గమేకీకృత్యత్రిభిర్భజేత్।**
**ఏకేన జీవితా భూమిర్ద్వితీయేన మృతాభవేత్।।**
**శూన్యే శూన్యం విజానీయా దిత్యుక్తం రుద్రయామిళే।।**

గ్రామవర్గ సంఖ్యను గృహ నిర్మాత నామవర్గ సంఖ్యను దిగ్వర్గ సంఖ్యను కల్పి దానిని 3 చే భాగింపవలెను. అట్లు చేయగా శేషము 1 మిగిలిన జీవభూమి, 2 శేష మయిన మృతభూమి సున్న శేషమయిన శూన్యభూమి యనియు శూన్యభూమియయిన ఫలరాహిత్యమైనది.


**శ్లో।। ఆయ విస్తారయో రైక్యం గ్రామాక్షర సమన్వితం।**
**చతుర్గుణం నామయుక్తం శివనేత్రైశ్చ భాజితం।।**
**ఏకెన జీవితాభూమి ర్ద్వాభ్యాం చ సమతాభవత్।**
**శూన్య శేషేతు శూన్యం స్యాదిత్యుక్తం రుద్రయామిళే।।**

యజమాని గృహము నిర్మించనున్న స్థలము యొక్క పొడవు వెడల్పులను కల్పి అందులో గ్రామాక్షర సంఖ్యను చేర్చి దానిని 4చే గుణించవలయును. అందులో యజమాని నామాక్షర సంఖ్యను చేర్చి 3 చే భాగించ వలయును. భాగించగా శేషము 1 అయిన జీవభూమి యనియు 2 మిగిలిన సమభూమి యనియు సున్న శేషమైన మృతభూమి యగును. ఈ ప్రకారముగా భూమి యొక్క జీవ నిర్జీవములను నిర్ణయించి గృహమును జీవభూమి యందు నిర్మించుకొన్న సర్వవిధముల శుభములు కలుగును. సమభూమియందు గృహమును నిర్మించిన సామాన్య శుభమనియు, మృతభూమి యందు గృహము నిర్మించిన హానియు కలుగునని తెలుసుకోని గృహము నిర్మించిన శుభములు చేకూరును.

**భూమి ప్రమాణము :-**

(మిగతా 25 వ పేజీలో)

# వాక్య గురుపరంపర



**విశేషాలు**

శ్రీమాన్ శ్రీ పరాశర రఘునాథ భట్టర్ స్వామి

పెద్దల మాటలను గుర్తుపెట్టుకుని చక్కగా గురుపరంపరానుసంధానం చేయాలి. పిళ్లైలోకాచార్యుల వారు **"జప్తవ్యం గురు పరంపరయుం ద్వయముం"** అని ప్రతి ప్రపన్నుడు ప్రతిరోజు గురుపరంపరను, అష్టాక్షరీ ద్వయ చరమ శ్లోకాలను మూడింటిని తప్పకుండా అనుసంధానం చేయాలి అని తెలిపారు. గురుపరంపర అనుసంధానం అయిన తర్వాతనే సంధ్యావందన, తిరువారాధనాది కార్యక్రమాలు చేయాలి. అందువల్లనే భగవదారాధనావిధిలో, ఆలయంలో జరిగే ఆరాధన విధిలో కూడా మొట్టమొదటి వాక్యం **"ఆచార్యః నిత్య కర్మ పరిసమాప్య ఆలయ ప్రాంగణం గత్వా"** అని ముందు నిత్య కర్మను పూర్తి చేయాలని ఉంటుంది. నిత్య కర్మ అనగా స్నానాదులు, గురుపరంపరానుసంధాన పూర్వక అనుష్ఠానం, సంధ్యావందనాదులు. ఆ తర్వాతనే భగవదారాధన తిరువారాధన చేయడానికి యోగ్యుడు.



శ్రీవైష్ణవ గురుపరంపర అనే దానిని మన పెద్దలు వాక్య రూపంలోనూ, శ్లోక రూపంలోనూ అందించారు. గురు పరంపరలోగల ప్రధానమైన ఆచార్యులు ఎవరైతే ఉన్నారో వారిని మనం అనుసంధించుకునే విధంగా పెద్దలు 13 వాక్యాలను అందజేశారు. అవి ఏమిటనగా.. అస్మద్గురుభ్యో నమః, అస్మత్పరమ గురుభ్యో నమః, అస్మత్సర్వ గురుభ్యో నమః, శ్రీమతే రామానుజాయ నమః, శ్రీపరాంకుశ దాసాయ నమః, శ్రీమద్యామున మునయే నమః, శ్రీరామ మిశ్రాయ నమః శ్రీపుండరీకాక్షాయ నమః, శ్రీమన్నాథమునయే నమః, శ్రీమతే శఠకోపాయ నమః, శ్రీమతే విష్వక్సేనాయ నమః, శ్రియై నమః, శ్రీధరాయ నమః

అని వాక్యగురుపరంపర ఇదే శ్లోక రూపంలో

**అస్మద్దేశిక మస్మదీయ పరమాచార్యాన్ అశేషాన్ గురూన్,**
**శ్రీమల్లక్ష్మణ యోగిపుంగవ మహాపూర్ణౌ మునిం యామునమ్।**
**రామం, పద్మవిలోచనం, మునివరం నాథం, శఠద్వేషిణం, సేనేశం,**
**శ్రియ, మిందిరాసహచరం నారాయణం సంశ్రయే॥**

"శ్రీమల్లక్ష్మణ యోగి పుంగవ" అనగా శ్రీమతే రామానుజాయ నమః. "మహాపూర్ణం" అనగా పెరియనంబివారు. శ్రీపరాంకుశ దాసాయ నమః. నమ్మాళ్వార్లకు దాసులు అని వారికి తిరునామం. వీరు భగవద్రామానుజులకు గురువులు. భగవద్రామానుజుల వారికి ఐదుగురు గురువులు. **పంచాచార్య పదాశ్రితాయ నమః** అని వారికి అష్టోత్తరములోని ఒక నామము. ఈ ఐదుగురు ఆచార్యులను యామునాచార్యులు ఏర్పాటు చేసినారు. రామానుజుల వారికి మంత్రోపదేశం చేసిన గురువులు పెరియనంబివారు. మంత్రార్థం రహస్యార్థం చెప్పిన వారు తిరుక్కోట్టియూరు నంబివారు. రామాయణ కాలక్షేపం చెప్పిన వారు మేనమామ గారైన తిరుమల నంబి వారు. వీరే శ్రీశైలపూర్ణులు.

పూర్వకాలం ఒకటికి పదిసార్లు పరీక్షించి శిష్యులకు మంత్రోపదేశం చేసేవారు. భగవద్ రామానుజాచార్యుల వారు మంత్రార్థం కాలక్షేపం వినడానికి 18 మార్లు ఆచార్యుల వద్దకు వెళ్లారు. అనగా 18 యోగ్యతలు ఉన్నప్పుడే మంత్రోపదేశం చేస్తారు. మంత్రార్థం వినడానికి మొదటి యోగ్యత సంసారంపై ఆశను కోల్పోవుట. ఇలా ఒక్కొక్కసారి ఒక్కొక్క యోగ్యతను చెబుతున్నారు ఆచార్యులు తిరుక్కోట్టియూరు నంబివారు. రెండవసారి అహంకార మమకారాలు లేకుండా, మూడవసారి దేహాత్మాభిమానం కోల్పోయి రా! నాలుగవసారి ఆత్మ స్వరూపం తెలుసుకుని రా! ఈ విధంగా 18 సార్లు తిప్పి పంపారట! భగవద్గీతలో కూడా 18 అధ్యాయాలు. చివరిగా **"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ"** అని శ్రీకృష్ణ పరమాత్మ ఉపాయం చెబుతాడు. 18 అధ్యాయాల్లోనూ ఉపాయాలను చెప్పి చివరగా సాధనాంతరాలన్నీ విడిచి రావాలని అర్జునునకు చెప్తాడు. అలాగే ఆసక్తి ఉన్నవారికి మంత్రోపదేశం చేయాలి. మంత్రం వినాలంటే 18 అర్హతలు

ఉండాలి. మంత్రార్థం శ్రేష్ఠమైనది. మోక్షంపై కోరిక కలిగిన వారికే చెప్పాలి. ఆ విధంగా పూర్వకాలంలో గురువులనే వారు పరీక్షించి ఉపదేశించేవారు. అలా 18 యోగ్యతలు కలిగిన వారని భగవద్రామానుజులవారికి తిరుక్కోట్టియూరు నంబి గారు మంత్రార్థాన్ని, నియమాన్ని కూడా చెప్పారు.

పూర్వం ఉండే ఆచార్యులకు అనువృత్తి ప్రసన్నాచార్యులని పేరు. అనగా మంత్రోపదేశం శిష్యుడు ఆచార్యులననుసరించి సేవ చేసి ప్రసన్నం చేసుకోవాలి. కానీ రామానుజాచార్యుల తర్వాత వచ్చిన ఆచార్యులు కృపామాత్ర ప్రసన్నాచార్యులు. వారికి కృప చూపించడమే తెలుసు. ఆసక్తితో వచ్చిన వారికందరికీ కృపతో ఉపదేశించాలని భగవద్రామానుజా చార్యులవారే ఏర్పాటు చేశారు. వారు తెలియకుంటే నష్టపోతారు! తెలుసుకొని బాగుపడతారు అని! అలా ఏర్పాటు చేశారు. ఈ కాలంలో కూడా ఆసక్తినే ప్రాధాన్యంగా తీసుకొని దయతో ఉపదేశం చేస్తున్నారు. **"ఆశై యుడై యోర్కెల్లామ్ ఆరియర్గాళ్ కూఱుమెన్డు"** అని భగవద్ రామానుజులవారే చెప్పారు. ఆవిధంగా మనకందించిన గురుపరంపర వాక్యాల్లో, శ్లోకాల్లో కూడా 13 వాక్యాలు చెప్పారు. అస్మద్గురుభ్యోనమః నుండి చివరి వరకు 13 వాక్యాలు ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా గమనించి చూస్తే అన్ని వాక్యాలు ఒకేలా లేవు. మొదటి మూడు వాక్యాలు ఒకేలా ఉన్నాయి. అస్మద్గురుభ్యో నమః, అస్మత్పరమ గురుభ్యో నమః, అస్మత్సర్వ గురుభ్యో నమః అని మూడు వాక్యాలు. అస్మద్గురుభ్యో నమః మా గురువులకు నమస్కారము. గురవే నమః అని ఏకవచనం లేకుండా గురుభ్యోనమః అని బహువచనం ఉంది. గురువనగా ఎవరు? అనగా మంత్రోపదేశం చేసిన వారే గురువు అని చాలామంది భావిస్తారు. కానీ మంత్రోపదేశం చేసిన వారు ఆచార్యులు అయినప్పటికీ వాక్య గురుపరంపర వ్యాఖ్యానాన్ననుసరించి మంత్రోపదేశం చేసిన వారే కాక సమకాలికులుగా ఉన్న సాంప్రదాయ పెద్దలు కూడా అని భావించాలి. మరియు గురువు వద్దకు చేర్చిన భాగవతులూ గురువులే! ప్రథమ తాంబూలం మంత్రోపదేశం చేసిన వారిది అయినప్పటికీ పై వారందరి గురించి అస్మత్ గురుభ్యోనమః అని చెప్పబడింది.

తర్వాత ఉన్న వాక్యాల్లో అందరికీ ఒకే రకమైన గౌరవ వాచకం లేదు భగవద్రామానుజులవారికి, నమ్మాళ్వార్లకు విశ్వక్సేనులవారికి **శ్రీమతే రామానుజాయ నమః, శ్రీమతే శఠకోపాయ నమః, శ్రీమతే విశ్వక్సేనాయనమః** ఈ ముగ్గురికి శ్రీమతే అని పదాలు ఉన్నాయి. అలాగే శ్రీమత్ శబ్దము. **శ్రీమన్నాథ మునయే నమః, శ్రీమద్యామునమునయే నమః** అని రెండు శ్రీమత్ శబ్దాలు ఉన్నాయి. అలాగే మూడు శ్రీ శబ్దాలు ఉన్నాయి. ఎందుకలా చెప్పబడింది? అనగా ఆచార్యులను మూడు రకాలుగా విభజించారు. విశదతమమైన జ్ఞాన భక్తి వైరాగ్యాలు కలవారు. విశదతరమైన జ్ఞాన భక్తి వైరాగ్యాలు కలవారు. విశదమైన జ్ఞాన భక్తి వైరాగ్యాలు కలవారు. పూర్వాచార్యులలో జ్ఞాన భక్తి వైరాగ్యాలకు ఎవరికీ కొరత లేదు. అందరికీ సమానమే! అయితే ఆ జ్ఞానాన్ని వారు తర్వాత వారికి అందజేసిన విధాన్ని బట్టి ఈ విధంగా విభజించారు. పూర్వాచార్యులలో విశదతమమైన జ్ఞాన భక్తి వైరాగ్యాలు గల ఆచార్యులు భగవద్రామానుజాచార్యులవారు, నమ్మాళ్వార్లు, విష్వక్సేనులవారు. వారు తమకున్న జ్ఞాన భక్తి వైరాగ్యాలను శిష్యులకు ఉపదేశం చేశారు. అంతటితో ఆపు చేయక తరతరాల వారు ఉజ్జీవించే విధంగా గ్రంథాలు రాశారు. తాము కలిగి ఉండుట, తమ నాశ్రయించిన వారికి ఉపదేశించుట, తరతరాల వారు జీవించే విధంగా గ్రంథాలు వ్రాయుట! అలా రామానుజుల వారు శ్రీభాష్య గీతాభాష్యాది తొమ్మిది గ్రంథాలు నవరత్నాలను రాశారు. నమ్మాళ్వార్లు భగవంతుని వద్ద నుండి తాము పొందిన ఆ భగవద్వైభవాన్ని నాథమునులకు పాశురాల రూపంలో ఉపదేశం చేశారు. ప్రబంధ రూపంలో లోకానికి అందజేశారు. విష్వక్సేనులవారు ఎంతోమంది ఆళ్వార్లకు మంత్రోపదేశం చేశారు. విష్వక్సేన సంహితనందించారు. వారు కూడా తాము పొందిన జ్ఞానాన్ని శిష్యులకు ఉపదేశం చేసి తరతరాలను ఉజ్జీవింప చేసే గ్రంథాలందించారు. నాథమునులకు, యామునాచార్యులకు **శ్రీమత్** అని పదాన్ని చెబుతాము. వీరిది విశదతరమైన జ్ఞానం అనగా తాముజ్జీవించారు, తమను ఆశ్రయించిన వారికి ఉపదేశాలు చేశారు. ఎక్కువ గ్రంథ రచన చేయలేదు. అందువలన విశదతరమైన జ్ఞాన భక్తి వైరాగ్యాలు కలవారు. శ్రీపరాంకుశ దాసులు, శ్రీరామమిశ్రులు, శ్రీపుండరీకాక్షులు అనగా పెరియనంబి, మణక్కాల్ నంబి, ఉయ్యక్కొండార్లు. వీరు ఆచార్యుల వద్ద నుండి ఉపదేశాలు పొందారు కానీ ఎక్కువ మంది శిష్యులను పెంచుకోలేదు. గ్రంథ రచన కూడా తక్కువే. ఈ విధంగా **శ్రీవైష్ణవ శ్రీ** ని పరంపరగా అందించారు కనుక శ్రీ అని చెప్పబడింది.

ఈ విధంగా మన సంప్రదాయంలో శ్రీవైష్ణవ గురుపరంపరలో **శ్రీమతే** అనే మూడు **శ్రీమత్** అని రెండు శ్రీ అని మూడు నామాలు చెప్పబడ్డాయి మిగిలినవి శ్రియై నమః శ్రీధరాయ నమః అని చెప్పబడ్డాయి. ★

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

(గత సంచిక తరువాయి) **ద్వార వాస్తు**

ద్వారవాస్తుకు వాస్తు శాస్త్రంలో ప్రధాన స్థానంవున్నది. ద్వార ప్రమాణాలు, ద్వారములు వుంచ వలసిన స్థానములు, వాటి ఫలితములు. ద్వారమునకు వాడే కర్ర, ముఖద్వార స్థానము. ముఖద్వారము, గృహ ప్రమాణము కొలతలను బట్టి ఎత్తు వెడల్పు ఎలావుండాలి?

1). మహాద్వారము - ప్రథమ ప్రవేశం గృహములోకి (మేన్‌డోర్)

2). ద్వారము - ఇది గృహం లోపలికి రెండవ ప్రవేశము

3) ఉప ద్వారం - ఇది గృహం లోనికి మూడవ ప్రవేశము (గదులలోకి ప్రవేశ మయ్యేది)

4) ఉపోపద్వారములు అనగా బాత్రూములు, స్టోర్ రూమ్ లకు ప్రవేశించు ద్వారములు.

ఇవి ఏ ప్రమాణములలో వుండాలి. ఎత్తు, వెడల్పు ఎంత యుండాలి. ఏఏ స్థానములలో ఉండాలి. వాటి వలన కలిగే శుభా శుభ ఫలితములు ఎలా మనకు అనుభవంలోకి ఎలా వర్తిస్తాయి. అలాగే గవాక్షములు కిటికీలు ద్వారమునకు ఎంత దూరంలో ఏ ప్రమాణము కొలతలలో ఏ సైజ్‌లో వుండాలి.

ఉప గవాక్షములు అనగా వెంటిలెటర్లు ఏకొలతలలో ఏ స్థానములలో వుండాలి.

ద్వారములు, కిటికీలు, వెంటిలెటర్లు ఏ సంఖ్యలలో వుండాలి, ఎందుకుండాలి, వాటివలన కలుగు ఫలితములు ఏమి? ద్వారములు, కిటికీలు, వెంటిలేటర్లకు సరి సంఖ్యలోనే ఎందుకుండాలి? అనగా 2-4-6-8-12. సరిసంఖ్యలు పది సున్నాలు కూడి సంఖ్య ఎందుకు పనికిరాదు? బేసి సంఖ్యలు 3-7-9-11-13-15 ఇలా బేసి సంఖ్యలో ద్వారములు. కిటికీలు ఇత్యాదులు ఎందుకు పెట్టకూడదు. అను వివరములు ప్రాచీనులు. వాస్తు ద్వారా విశదీకరించారు. వాటిని క్రమంలో తెలిసికునే ప్రయత్నం చేద్దాము.

( వచ్చే సంచికలో మరికొంత తెలుసుకొందాం)

## మీ ప్రశ్న !!
## మా జవాబు ...

శ్రీసన్నిధానం పత్రిక ద్వారా అందరికీ ఆసక్తిని కలిగించి, జిజ్ఞాసను తీర్చే విధంగా జ్యోతిష్య సంబంధ విశేషాలను అందిస్తున్నారు. జ్యోతిష్య పరిజ్ఞానాన్ని పాఠకులకు అందించే ప్రయత్నంలో పాఠకుల నుండి వస్తున్న స్పందనలకు చాలా సంతోషం.

పాఠకుల సందేహాలు, సమాధానాలు జ్యోతిష్య శాస్త్ర విశేషాల కొరకు వెంటనే సంప్రదించండి.

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**
**మీసందేహాలను నివృత్తి చేసుకోండి!!**

మీ సందేహాలను శ్రీసన్నిధానం వెబ్‌సైట్ ద్వారా కానీ, వాట్సప్ ద్వారా కూడా పంపించవచ్చు

సందేహ ప్రశ్నలను పంపాల్సి వాట్స్ ఆప్ నెం 9502583323

-మేనేజింగ్ ఎడిటర్

# భరన్యాసము

# భగవంతుని పైనే భారము...



శ్రీమతి వంగల రాధిక

న్యాస మందు ఆకిఞ్చనత్వం, అనన్య గతిత్వం ప్రధానమైనవి. వాటిని చాటు కుంటూ ముందుకు కదులుతున్నాము! భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ 3 త్యాగాలు చేయమన్నారు. జ్ఞానయోగం, ధ్యానయోగం అనితర సాధ్యమైనవి! జారిపోయే ప్రమాదమున్నది. సులభమైనది కర్మయోగమే! సాధనాంతరాలైన ఆరెండు యోగములను వదిలి కర్మయోగములో ముందుకుసాగాలి! దానికి మనము 3 త్యాగాలు చేయాలి. పరమాత్మే చెప్పినట్లు సర్వధర్మాన్ పరిత్యజ్య అనగా దేనిని పరిత్యజించాలి? సర్వ ధర్మాన్ అంటే ధర్మమార్గమును వీడమని కాదు. మనము ఒక గీత గిరిగీసుకొని నేను ఈపని చేస్తేనే కాని ఈ ఫలము దక్కదు నేనే చేయాలి. పరమాత్మను నేనే భక్తితో వేడుకోవాలి నాకు కావలసింది కోరుకోవాలి! అనేది మొట్ట మొదటి తప్పు. ఈ భావము పోవాలి నేను ఆయన సొత్తును నాకేది శ్రేయస్కరమో ఆయనకు తెలుసు అంటే కర్తృత్వబుద్ధి పోవాలి. అదే "కర్తృత్వ త్యాగం". న్యాసమంటే కూడా వదులుట! త్యాగము చేయుట. త్యాజ్యము చేయవలసినది నేను అనే అహంకారాన్ని. అదే కర్తృత్వ బుద్ధి త్యాగం. "అహం నమమ, మద్రక్షణభరం నమమ" నన్ను కాపాడుకోవలసిన బాధ్యత నాది కాదు. నారక్షణ నేనే చేసుకోవాలన్న కోరిక త్యాజ్యం చేయడం. ధనము, ఆప్తులు, బంధుజనులు,స్నేహితులు భావించకుండా "మాతాపితా యువతయస్థనయా విభూతి సర్వం" అని భావించాలి. "కులం తరుం శెల్వంతందిడుం" అన్నీ ఆయనే ఇచ్చేస్తారు. ఇంక కోరిక దేనికి? త్యజించు. అదే మమతాత్యాగం.

పరమాత్మయే మనకు రక్షకుడని మన బాధ్యత ఆయన మీద వదిలేసినప్పుడు "నిన్నైన్దిరున్దేన్, శ్రమంతీర్ న్దేన్" మనకు పెద్ద శ్రమ తప్పినట్లనిపిస్తుంది. హృదయము తేలికగా అయిపోతుంది. ఎంత అద్భుతమైన భావన అది! ఒక కర్మను మనము ఆచరిస్తే దాని వల్ల వచ్చే ఫలము మనదను కొంటాము. పాపఫలము పుణ్యఫలము, అని మనము కర్మ చేయడముద్వారా ఆకర్మ నేను ఆచరించాననుకొంటేనే కదా ఫలము లభిస్తుంది. ఏదో ఫలము కావాలనే మమత! మమతా త్యాగము చేసిన తరువాత ఇంక ఫలముమీద ఆశ దానంతటదే పోతుంది. పరమాత్మే మనకు రక్షకుడైనప్పుడు "నాట్టినుళ్ళ పావమెల్లాం - తూర్గళ్ పాంయ్ న్దనవే" మోక్షమును మనము కోరుకోవలసిన పని లేదు. ఎప్పుడు పరమాత్మకు వినియుజ్యమాన వస్తువుగా మనలను మనము మలచుకొంటామో ఆయనే మనలను పొందాలని తాపత్రయపడి మనలను తన దరిచేర్చు కొంటాడు.

మనకు శరీరేంద్రియాలను, (కర్మేంద్రియాలను, జ్ఞానేంద్రియాలను) ఆత్మను అన్నీ ఇచ్చినది పరమాత్మనే! అవి ఆయనవే మనము కర్మ చేయడమేమిటి? ఆ ఫలము మనదెలా అవుతుంది? అలా కర్మ వల్ల వచ్చే ఫలమును త్యాగం చేయడం ఫలత్యాగం. అందుకే కర్తృత్వ త్యాగము, మమతా త్యాగము ఫల త్యాగము, ఈ మూడు ఆచరించగలిగితే మనము ఆయన వినియుజ్యమైన వస్తువుగా మారిపోతాము. "అహం నమమ శ్రీపతేరేవ, మద్రక్షణభరం నమమ శ్రీపతేరేవ" ఈ విధంగా అందంగా ఈ మొదటి శ్లోకములో ఇంతర్థాన్ని ఇమిడ్చారు. ఇవే భగవద్విషయ అనుసంధానములో తెలుసుకుందాము. పురుషాహంకారాన్ని ప్రక్కకు తోసి స్త్రీభావముతో, నాయికా భావముతో 27 పాశు రాలను నమ్మాళ్వార్ పాడారు! 100 పదిగములో 27 పదిగములు, పరాశర నాయికగా పాడారు. నాయిక అనగా సఖిగా, తాయ్ (తల్లిగా), మగళ్ (కూతురు), తలైవి (నాయిక) గా ఇలా రక రకాల భావాలలో పాడారు. అన్నీ స్త్రీ తత్వమేగా అందులో వ్యత్యాసమేముందనిపిస్తుంది. కానీ అందులో భావ గాంభీర్యముంది. సఖిగా 3 పాటలు పాడారు. సఖిగా పరమాత్మకు మనకు వున్న సంబంధమును తెలుపుతుంది. నీవు ప్రేమించిన వ్యక్తి చాలా వుత్తముడు. ఎన్నో విశిష్టమైన గుణములు కలవాడు . నీ ప్రేమ చాలా గొప్పదే! అంటూ తన ప్రియతమ స్నేహితురాలిని ప్రోత్సహిస్తుంది. అంటే ప్రియురాలికి ప్రియుడికి మధ్యవున్నసంబంధాన్ని చెప్పి ధృఢపరుస్తుంది. నీవు అతనికే (మిగతా 24 వ పేజీలో)

# భాగవతంలో భగవంతుని


# అవతార గాథలు



**శ్రీమతి తిరుమల నీరజ**

(క్రిందటి సంచిక తరువాయి)

అటువంటి ఉత్సవసమయంలో దేవహూతికి తత్త్వజ్ఞానబోధ చేయటానికి, ఆమెకు జన్మించిన పరబ్రహ్మ స్వరూపుడైన నారాయణుని దర్శనం కొరకు మరీచాది ప్రముఖముని గణంతో కలసి నలువ బ్రహ్మదేవుడు వచ్చాడు. దర్శించుకున్న తర్వాత, బ్రహ్మదేవుడు కర్దమ దేవహూతులతో ఈ విధంగా అన్నాడు : "ఓ దంపతులారా! స్వామిని పుత్రుడుగా పొందడంతో మీ జన్మ సఫలమైంది. ఆ శ్రీహరిని అనన్యభక్తితో భజిస్తే ముక్తి కలుగుతుంది. ఆయననే కుమారుడుగా పొందిన మీ పుణ్యం ఎంత గొప్పది!" అని ప్రశంసించి, కర్దమమునితో, "నీ కుమార్తెలను శ్రేష్ఠులైన మునుల కిచ్చి వివాహం చేయి. వారి ద్వారా పలు విధాలుగా ప్రజాసృష్టి జరుగుతుంది" అని ఆదేశించాడు. ఆ పైన మళ్లీ "ఓ అనఘా! ఈ నీ కుమారుడు ప్రాణులందరి కోరికలనూ తీర్చేవాడు కాబట్టి, ఆతనిని పరమేశ్వరుడు, అజితుడు, నలినాక్షుడు, అమేయుడు, అచ్యుతుడు, ఘనుడు, అనంతుడు, ఆద్యుడు, అవికారుడు, అక్షరుడు ఐన శ్రీమన్నారాయణుడే అన్నారు. ఈ మహానుభావుడు నీ శంక లన్నీ తీరిపోయే విధంగా తత్త్వబోధ చేస్తాడు. కపిలుడు అనే పేరుతో సాంఖ్యయోగంలో ప్రవీణుడై విరాజిల్లుతాడు" అని, మరీచిమహర్షిని అక్కడే ఉండమని నియోగించి, తన కుమారులైన నారద సనకాదులతో తన నివాసానికి వెళ్లిపోయాడు.



అటు తర్వాత కర్దమముని ధాత విరించి ఐన బ్రహ్మ ఆజ్ఞ ప్రకారం, తన కుమార్తెలకు ఉద్వాహం చేయాలని నిర్ణయించుకున్నాడు. కళను మరీచికి, అనసూయను అత్రికి, శ్రద్ధను అంగిరసునికి, హవిర్భువును పులస్త్యునికి, గతిని పులహునికి, క్రియను క్రతువుకు, ఖ్యాతిని భృగువుకు, అరుంధతిని వశిష్ఠునికి, శాంతిని అథర్వునికి ఇచ్చి వివాహాలు జరిపించాడు. వారందరూ ఎవరెవరి ఆశ్రమాలకు తమ తమ పత్నులతో సహా వెళ్లారు.

అప్పుడు కర్దమముని భగవంతుడైన శ్రీహరితో ఏకాంతంలో ఆయనకు వందనం చేసి ఇట్లా అన్నాడు "మునుపు నేను చేసిన తపస్సుకు ప్రసన్నుడివై, నా కిచ్చినమాట ప్రకారం నన్ను అనుగ్రహించటానికి నాకు కొడుకువై జన్మించావు. నిన్ను కీర్తించటం ఎవరికి సాధ్యం? నీవు నాకు పుట్టడంతో నేను దేవ, ఋషి, పితృ ఋణాల నుండి విముక్తి పొందాను. నియమనిష్ఠలతో నీ చరణకమలాలనే నా మనసులో నిలుపుకొంటాను" అన్నాడు.

అప్పుడు కపిలుడు ప్రేమతో కర్దమమునితో "ఓ మునీశ్వరా! కేవలం అనుగ్రహంతో నీ ఇంట పుట్టాను. అందరికీ తత్త్వజ్ఞానాన్ని బోధించడం కోసమే ఈ దేహాన్ని ధరించాను. భక్తితో నా పాదాలను ధ్యానించు. సన్యాసం స్వీకరించి, మోక్షం కొరకు భక్తితో యోగమార్గాన్ని అవలంబించు. నీ ఆ ధ్యానంలో మనోనేత్రంతో నన్ను దర్శించు. నీకు మోక్షం సిద్ధిస్తుంది" అని చెప్పాడు.

కర్దమముని కపిలునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, అరణ్యాలకు వెళ్లాడు. ఆత్మలో పరమాత్మను శరణు పొంది, సమస్త ప్రపంచాన్నీ శ్రీవాసుదేవస్వరూపంగా చూస్తూ, భక్తియోగంలో భాగవతులందరూ పొందే స్థానం పొందాడు.

అటుపైన దేవహూతి బిందుసరోవరం దగ్గరే ఉన్న కపిలమహర్షిని చూసింది. చతుర్ముఖుడైన బ్రహ్మదేవుని మాటలనే స్మరించుకుంటూ కుమారునితో ఈ విధంగా పలికింది "ఓ పాపరహితుడా! ఈ మోహ మనే అంధకారం నుంచి బయటపడే ఉపాయం నా కెట్లా లభిస్తుంది? ఓ

## భాగవతంలో భగవంతుని అవతార గాథలు

నిరంజనా! సర్వశరణ్యా! సర్వలోకాలకూ శుభాలు చేకూర్చే ప్రభూ! నన్ను చుట్టుముట్టిన మోహం నుంచి రక్షించడానికి నీవు తప్ప ఇంకెవరున్నారయ్యా? నీకుశరణు! నన్ను కరుణించు" అన్నాడు.

చిరునవ్వులు చిందే సుందరముఖారవిందంతో కపిలుడు పరమశాంతుడై, తల్లితో ఇట్లా అన్నాడు "అమ్మా! విను. ఈ భవలోకబంధాలకు జీవుని చిత్తమే కారణం. అది సత్త్వ రజ స్తమోగుణాలతో కలసినప్పుడు, సంసారబంధానికి కారణ మవుతుంది. ఆ చిత్తాన్నే శ్రీహరి మీద లగ్నం చేస్తే మోక్షకారణ మవుతుంది. 'నేను' అనే అహంకారం, 'నాది' అనే మమకారం వల్ల కామ క్రోధ లోభాది కలుషాలు పుడతాయి. వీటి నుంచి విడివడినప్పుడు మన మనసు ప్రశాంత మవుతుంది. కర్మఫలాలను వదలిపెట్టి, ఎవరి మీదా ప్రత్యేకమైన అభిమానం లేకుండా, నా పాదాలను ఆశ్రయించి నా గుణగానం చేస్తూ, నా కథలనే వింటూ, అవి వినటం వల్లనే ఆనందం పొందేవారు పరమభాగవతోత్తములు. అలాటివారి సాంగత్యంలో కర్ణరసాయనమైన నా కథాప్రసంగాలు లభిస్తాయి. అది భక్తిగా మారుతుంది. ఈ భక్తియోగమే మోక్షం కలిగిస్తుంది."

"ఎలాటి భక్తి వల్ల నీ గుణాలపై ఇష్టం కలుగుతుంది? ఏ భక్తి జన్మ, సంసారతాప పాపాలను పోగొడుతుంది? ఏ భక్తి అతిత్వరితంగా ముక్తిని కలిగిస్తుంది? విపులంగా చెప్పు" అని దేవహూతి పుత్రుడైన కపిలుణ్ణి అడిగింది.

"తల్లీ! ఏ ఫలమూ ఆశించకుండా చేసే భగవత్సేవ ముక్తి కంటే గొప్పది. ఎవడైతే ధనం, పశువులు, పుత్రులు, మిత్రులు, స్త్రీలు, ఇంకా ఇతరాలపై ఆసక్తి లేకుండా, ఈ విశ్వ మంతా వ్యాపించినవాణ్ణి, అనఘుణ్ణి ఐన నన్ను ఏకాగ్రతతో ధ్యానం చేస్తాడో, అలాటివాణ్ని మృత్యురూపమైన సంసారసముద్రం నుంచి నేను తరింపచేస్తాను.

"నేను ప్రధానపురుషునికి అధినాయకుణ్ని. భగవంతుణ్ని. జగత్తు కంతటికీ ప్రభువును. నన్ను కాక ఇతరులను ఆశ్రయించేవారు జననమరణాల సంసారచక్రంలో పడతారు. నా ఆజ్ఞ పైనే గాలి వీస్తుంది. అగ్ని ప్రజ్వరిల్లుతుంది. సూర్యుడు ప్రకాశిస్తాడు. పాకశాసనుడు వర్షిస్తాడు. మృత్యువు భయంతో పరుగెత్తుతుంది. అందుచేత విజ్ఞానం, వైరాగ్యాలతో కూడిన భక్తియోగం చేత లభించే పరమపదం కోసం యోగు లందరూ నిర్భయంగా నా పాదపద్మాలను సేవిస్తూ ఉంటారు. అంత లేని భక్తితో ఎంతవరకు సత్పురుషులు మనసును నా పైనే నిలుపుతారో, అంతవరకూ వారికి ఈ లోకం లోనే మోక్షం కలుగుతుంది" అని హరిభక్తిని తెలియచేశాడు.

(సశేషం)

## శ్రీరామానుజ సుధామాధురి

(07 వ పేజీ తరువాయి) ఆది మధ్యాంతరహితా అపార కారుణ్య వాత్సల్యైక జలధే! నిఖిల చరాచర నియామ్య భూతపరేశా! శ్రీ వెంకటేశా! అఖిల జగత్ స్వామిన్ అస్మత్ స్వామిన్ శ్రీ భూనీళాసమేతులగు శ్రీ శ్రీనివాస స్వామి పాదారవిందముల సన్నిధికి అడియేన్ రామానుజ దాసం అనేక అనేక ప్రణామములు ఆచరించి విన్నవించు విజ్ఞాపన పత్రిక. శ్రీ భగవత్ భాగవతాచార్య ఆరాధనకై పాలు పెరుగు సమర్పించిన ఈ గోపవనితకు మోక్షమును ప్రసాదింప ప్రార్థించుచున్నాను. సర్వాపరాధాన్ క్షంతు మర్హతి సంతతః అడియేన్ రామానుజ దాసః" అని వ్రాసిన శ్రీ ముఖాన్ని గొల్ల చేతికి ఇచ్చారు. దానిని తీసుకొని ఆ గోపవనిత కళ్ళకద్దుకొని ఎంతో విశ్వాసంతో ఆచార్య భక్తితో దానిని కొండపైన గల శ్రీనివాసమూర్తికి సమర్పించి మోక్షాన్ని పొందింది అని చరిత్ర వైభవం! ఆత్మోజ్జీవన స్ఫూర్తితో ధార్మిక జీవనాన్ని అనుసరించే వారు స్త్రీలైనా వారిని వర్ణ జాతిభేదము లేకుండా ఉద్ధరించే లోకోత్తరమైన సాంప్రదాయ సిద్ధాంతాన్ని ప్రవర్తింప చేశారు శ్రీ భగవద్రామానుజాచార్యులు.


**ఆధ్యాత్మిక రచయితలకు, కవులకు..స్వాగతం :** సమాజ హితానికి, ఆత్మోజ్జీవనానికి మార్గాన్ని చూపిస్తూ వెలుగులు నింపే ఆధ్యాత్మిక, శాస్త్ర, ఇతిహాస పురాణ వైదిక ధర్మ విశేషాలను, రచనలను మాకు పంపండి. ఆధునికులనూ, సామాన్యులనూ ఆలోచింపచేసే రచనలు మాకందించండి.. శ్రీసన్నిధానం మాస పత్రిక ద్వారా పాఠకలోకానికి అందిద్దాం !...

శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక తృతీయ వార్షికోత్సవ శుభాకాంక్షలతో

# మంగళాశాసనాలు

**భగవద్భాగవతాచార్య మంగళాశాసనములతో ప్రారంభమై, ఆధ్యాత్మిక సాంప్రదాయ వాక్సుధను అందిస్తూ, సమాజ హితము లక్ష్యంగా, సంస్కృతి సంరక్షణయే బాధ్యతగా ముందుకు సాగుతున్నది శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక. నేటికి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడవ వత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా శుభాశంసలను అందించే, అభిమానించే శ్రేయోభిలాషులైన పాఠకులకు పండితులకు వ్యాసకర్తలకు శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాసపత్రిక వందనం సమర్పించుకుంటున్నది.**

## ఆచార్య అనుగ్రహం



శ్రీసన్నిధానం మాసపత్రిక వారు రెండు సంవత్సరాల కాలం పూర్తి చేసుకున్నటువంటి ఈ శుభ సందర్భంగా వారికి అనేకమైన మంగళాశాసనాలు చేస్తున్నాము. సాంప్రదాయంలో వివిధ ఆలయా లలో జరిగే వివరణలతో పాటు సాంప్రదాయ ఆచార్యుల యొక్క కార్యక్రమాల వివరాలతో అత్యంత అద్భుతంగా వీరు వారి యొక్క శ్రమతో శ్రీసాంప్రదాయా నికి చేస్తున్నటువంటి వైష్ణవ సేవ విశేష సేవకు అభినందనలు కూడా తెలియ జేస్తున్నాము. ఆచార్యుల యొక్క వివరాలతో పాటు మంచి శీర్షికలని వారు ప్రచురిస్తూ పాంచరాత్రాగమంలో జరుగుతు న్నటువంటి సేవా కార్యక్రమాలను వారి యొక్క మాసపత్రికలో తెలియజేస్తూ, వైష్ణవ సాంప్రదాయానికి చేస్తున్నటువంటి సేవకు మేము మంగళాశాసనాలు తెలియజేస్తూన్నాము.

ఇలాంటి వార్షికోత్సవాలు ఎన్నో జరుపుకోవాలని, ఇంకా ఉన్నతంగా వివరాలు తెలియజేస్తూ చాలా విశేషంగా వారి యొక్క కార్యక్రమాలు జరగాలని మంగళా శాసనాలు చేస్తూ...

జై శ్రీమన్నారాయణ

**పరమహంస పరివ్రాజకాచార్య ఉభయవేదాంత ప్రవర్తకాచార్య శ్రీ శ్రీ శ్రీ గంగోత్రి రామనుజ జీయర్, గంగోత్రి**

## సేవాభాగ్యము



జ్ఞానభూమిగా ఎందరెందరో విజ్ఞాన ధనులకు మాతృభూమిగా రాజిల్లే కరీంనగరం పట్టణం నుండి "శ్రీసన్నిధానం" మాసపత్రిక ఆధ్యాత్మిక, రామానుజ సంప్రదాయ విశేషాలను ఆవిష్కరిస్తూ ప్రతి నెల సహృదయ జనుల హృదయా భరణంగా ప్రకాశిస్తూ ప్రకటింపబడుచున్నది. సుప్రసిద్ధ విద్వాంసుల వాగ్వైభవమును వైదుష్యమును విభిన్న శీర్షికల ద్వారా వెలువరిస్తూ పాఠకుల మానస పుత్రికగా ఈ శ్రీసన్నిధానం మాసపత్రిక అపారమైన కీర్తి ప్రతిష్ఠలను సొంతం చేసుకున్నది. ఈ జ్ఞాన యజ్ఞమును సమర్థవంతంగా నిర్వహించుటలో కీలక భూమికను వహిస్తున్న సంపాదకులకు హృదయ పూర్వకంగా అభినందన చందనములను సమర్పిస్తున్నాను. రామానుజ సంప్రదాయ ప్రచారమును, సంప్రదాయ పరిరక్షణ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్న "శ్రీసన్నిధానం" పత్రికా నిర్వాహకులకు నమోవాకములను అర్పిస్తున్నాను. భవదీయుడు

**సముద్రాల శఠకోపాచార్య, అధ్యక్షులు,**
**ఉభయ వేదాంత సభ అసోసియేషన్, వరంగల్,**
**ప్రధాన కార్యదర్శి, సత్సంప్రదాయ పరిరక్షణసభట్రస్టు**



సాంప్రదాయ సేవలో ముందుకు సాగుతూ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు శుభాకాంక్షలు అందజేస్తున్నాను.

**శ్రీమాన్ శ్రీ చిలుకమర్రి శ్రీవర్ధనాచార్యులు. నిజామాబాద్**



అనేకానేక సంప్రదాయ, ఆధ్యాత్మిక వ్యాసాలు అందిస్తూ మూడవ ఏట ప్రవేశించిన ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక “శ్రీసన్నిధానం” పత్రికకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఇంకా నిత్య జీవితంలో ఆచారము పాటించే విషయంలో (పూర్వ, అపర కార్యములలో) ఎదురయ్యే సమస్యలకు కూడా సమాధానాలు సుప్రసిద్ధుల ద్వారా అందించేటట్లు ఒక శీర్షికను కూడా ప్రారంభం చేయమని సూచిస్తున్నాను. విశేషమైన విషయాలు అందిస్తున్న పూజ్యులకు ప్రణామములు సమర్పిస్తూ.

**మనస్విని ప్రచురణలు. కోయిల్ కందాడై వేంకట లక్ష్మణ స్వామి. విశ్రాంత ఆంధ్ర ఉపాధ్యాయులు.భాగ్యనగరం,**



పాయాత్ కుమారజనకాఖ్య ఉమావిలాసః
శంఖప్రభశ్చ నిధనేశ గవీశయానః
గంగాచ పన్నగధరశ్చ పినాకసక్తః
ఆద్యక్షరేణ సహితో రహితో భవంతమ్.

ఇది ఒక అద్భుతమైన మా పూర్వీకులు రచించిన చమత్కార మరియు శివ కేశవ అభేదత్వం తెలిపే మంగళాశాసన పూర్వక శ్లోకం. దీనిలో కుమార జనకాఖ్య నుండి పినాకసక్తః వరకు ఉన్న మాటల మొదటి అక్షరం ఉంచి చదివితే శివపరంగాను మొదటి అక్షరం తీసివేసి చదివితే విష్ణు పరంగానూ అర్థం వస్తుంది.ఆ ఇద్దరూ శ్రీసన్నిధానం పత్రికకు మంగళములు చేకూర్చుగాక!

**-శ్రీమాన్ శ్రీ మరింగంటి లక్ష్మణాచార్యులు, హైదరాబాద్.**



భగవానుని కంఠాన్ని అలంకరించిన అనేక రకాల పుష్పాలతో కూర్చిన వైజయంతిమాల, అనేక పరిమళాలను వెద జల్లినట్లుగా, శ్రీసన్నిధానం అనే ఈ ఆధ్యాత్మిక మాస పత్రిక కూడా పరమ భాగవతుల యొక్క శ్రీసూక్తి సమాహారంగా, భక్తి పరిమళాలను పాఠకులకు అందిస్తున్న విషయం మనకు తెలిసినదే. రెండవ వార్షికము పూర్తి చేసుకుని మూడవ వర్షంలో అడుగుపెట్టిన శ్రీసన్నిధానం, మనకు ఇంకా, ఇంకా భక్తి పరిమళాలు అందించాలని, శుభాకాంక్షలతో...

**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

దేశానికి శ్రేయస్సు కలుగు గాక!



శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక పత్రిక తృతీయ వార్షిక సంచిక వెలుగులోకి రావడం ఎంతో సంతోషం ఇంతింతై వటుడింతై అన్నట్లు క్రమక్రమాభి వృద్ధి శుభ పరిణామం. దేశానికి శ్రేయస్సు కలుగు గాక! ఆధ్యాత్మిక విలువలు, మహాత్ముల శ్రీసూక్తులు, బాలురకు, యువతకు యావన్మందికి తగిన శీర్షికలతో వివిధ విజ్ఞాన విషయములు, ఒక దివ్య దేశ పరిచయములతో కూడా ఇంకనూ ఇతోధికంగా అభివృద్ధి పథములో పయనించు గాక! మీ కృషి ఆశయమునకు ఆ శ్రియః పతి అన్నివిధములుగా తన దివ్య కటాక్షములు కురిపించుగాక!

**శ్రీమాన్ శ్రీ డా. ఎమ్. టి. ఆళ్వార్, తాడేపల్లి**



శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ద్వారా ఎన్నో ఎన్నో సాంప్రదాయక విషయాలు, సామాన్య విషయాలు, ఆచరింపదగిన విషయాలు, తెలుసుకొనే విషయాలు పాఠకులకు అందుతూ వున్నాయి. చాలా సంతోషంగా వుంది. భగవత్ భాగవత ఆచార్య కటాక్షం చేత ఉత్తరోత్తరా అభివృద్ధి చెందాలని కోరుకుంటూ ఆచార్య శ్రీహస్తేన ఆడియెన్ రామానుజ దాసన్.

**శ్రీమాన్ శ్రీ డా. వోలేటి రవి కుమారాచార్య, హైదరాబాద్**



పత్రిక చాలా అందంగా ఉంది! విషయాలు చాలా బాగా నిర్వచించబడ్డాయి. విద్యావంతంగా ఉంది. జ్ఞానమే కాదు, అనుభవం కూడా అమృతమే. ఎంచుకున్న అంశాల వైవిధ్యం చాలా మనోహరంగా ఉంది.

**శ్రీమతి వంగల రాధిక**



మీ పత్రిక సర్వాంగ సుందరంగా వెలువడింది. ముస్ముందు అచ్చుపత్రికగా వెలుగొందాలని ఈ పత్రికను అభినందిస్తు న్నాను. సంప్రదాయ పరిరక్షణకు నిరంతరం పాటుబడుచు ప్రపన్నుల కరదీపిక కావలెనని మంగళములను ఆశాసించుచున్నాడ.

**-శ్రీమాన్ శ్రీ డా.కోవెల శ్రీనివాసాచార్య, నిర్మల్**



## శ్రీరామాయణంలో ఉపకథలు

# శ్రీరాముని శరణాగత వత్సలత్వం



**శ్రీమతి చక్రవర్తుల చూడామణి , ఖమ్మం**

**వేద వేద్యే పారే పుంసి జాతే దశరథాత్మజే।**
**వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥**

రామాయణాన్ని దీర్ఘ శరణాగతి శాస్త్రం అంటారు. రామాయణంలో దేవతల శరణాగతి నుంచి లక్ష్మణ శరణాగతి, గుహుడి శరణాగతి, భరతుడి శరణాగతి, జటాయు శరణాగతి, సుగ్రీవ శరణాగతి, శబరి శరణాగతి, విభీషణ శరణాగతి, రాముడు సముద్రుని శరణాగతి చేయడం ఇలా అనేక శరణాగతులు కనపడతాయి. కొన్ని సఫలమయ్యాయి కొన్ని విఫలమయ్యాయి అన్నిట్లోకి విభీషణ శరణాగతికి ప్రత్యేక స్థానం ఉంది. విభీషణుడు శత్రు శిబిరం నుంచి వచ్చినవాడు, రాక్షసుడు, రావణుడి తమ్ముడు. అన్న శత్రువునే అభయం కోరి వచ్చాడు. అభయం ఇవ్వొద్దని సుగ్రీవుడు రాముడికి చెప్పాడు. హనుమ విభీషణుడు గుణపూర్ణుడే అభయం ఇవ్వవచ్చని చెప్పాడు.

శ్రీరాముడు చరమ శ్లోకంలో **సకృదేవప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే। అభయం సర్వ భూతేభ్యో దదామే తద్ వ్రతం మమ॥** అన్నాడు. ఒక్కసారి ప్రపత్తి చేసి అభయం కోరితే వారిని రక్షించడం నా వ్రతం. సమస్త భూతాల నుండి వారికి రక్షణ కల్పిస్తాను అంటాడు. సర్వ భూతాల నుంచి అంటే ఆయన సృష్టిలో ఉన్న అన్ని భూతాల నుంచి అని అర్థం వస్తుంది. అంతే కాదు, తాను కూడా ఒక భూతమే కాబట్టి తన నుంచి కూడా రక్షణ కల్పిస్తానంటాడు. అదేమిటి రాముడు తనను శరణాగతి చేసినవాడికి ఆపద కల్పిస్తాడా? అన్న సందేహం కలుగుతుంది. అవును ఆయనను ఆశ్రయించినవాడు దోషాలు చేయడం లో ప్రథముడు. ఒకవేళ పొరపాటున వాడి దోషాలను చూసి రాముడు ముఖం తిప్పుకోవచ్చు, అదే ఆయన నుంచి వచ్చే ఆపద. అలా జరగదు, ఒకవేళ జరిగితే అప్పుడు కూడా తానే రక్షిస్తానని దీక్ష పట్టాడు.

**'మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన।**
**దోషోయద్యపి తస్యస్యాత్ సతామేతదగర్హితం॥'**

శరణాగతి చేసిన వాడు నిజంగా సుజ్ఞానం పొంది వచ్చినా సరే, లేక మిత్రుడిగా వేషం వేసుకొని వచ్చినా సరే నేను వదిలి పెట్టను, అభయం ఇచ్చి తీరుతాను. వాడిలో దోషాలున్నా సరే అవన్నీ పరిగణించను అన్నాడు. ఇక్కడ రెండు రకాలుగా మనం అర్థం చేసుకోవాలి. దోషాలు లేని వాడిని రక్షించడం లో రాముడి గొప్పతనం ఏముంది? పరాశరాదుల వంటి వారికి మోక్షం ఇస్తే అదేమీ విశేషం కాదు. వాళ్ళు ఎలాగూ అర్హత గలవాళ్ళు, మనలాంటి అల్పులకు మోక్షం ఇస్తే అది విశేషం అవుతుంది. దోషాలున్నప్పటికీ అని మాత్రమే కాదు దోషాలున్నవాడికే ఆయన అభయం ఇస్తాడు. ఇది రాముడి వ్రతం, దీక్ష. ఒక దీక్షలో ఉన్నవాడు దానికి ఏ అవరోధాలు వచ్చినా ఆ దీక్ష నుండి విరమించకూడదు. రాముడు ఈ దీక్షను కొంతకాలం కోసం పట్టలేదు. లోకంలో దోషాలు చేసే వాళ్ళు ఉన్నంత వరకు ఈ దీక్ష కొనసాగుతూ ఉంటుంది. దోషాలు చేసే వాళ్ళు లేని రోజు వస్తుందో రాదో మనకు తెలియదు కాబట్టి రాముడి దీక్ష ఎప్పటికీ విరమించడు అని అర్థం చేసుకుంటే చాలు. ఇదంతా వివరించి చెప్పినా సుగ్రీవుడు అంగీకరించలేదు. అప్పుడు రాముడు ఒక పావురం కథను చెప్పాడు.

'సుగ్రీవా!' మా వంశంలో పెద్దలు చెప్పిన కథ,వేదంలో ఉన్న కథ ఒకటి చెపుతాను విను. ఒక అడవిలో చెట్టు మీద పావురాల జంట ఉండేది. అవి ఎంతో అన్యోన్యంగా ఆనందంగా ఉన్నాయి. ఒకరోజు ఒక వేటగాడు ఆడ పక్షిని వేటాడి దాని మాంసాన్ని తిన్నాడు. కొంతకాలం గడిచిపోయింది. కాలం మారింది. చలికాలం వచ్చింది. ఆ వేటగాడు మళ్ళీ అడవికి వచ్చాడు. అదే చెట్టు కిందికి వచ్చి చలితో వణుకుతున్నాడు. దగ్గరలో ఉన్న పుల్లలన్నీ తెచ్చి చలిమంట వేసుకున్నాడు. ఆకలితో బాధ పడుతున్నాడు. అప్పుడు ఈ మగ పక్షి వాడిని చూసి గుర్తించి మనకు అతిథిగా వచ్చిన వేటగాడు ఆకలితో చలితో బాధపడుతున్నాడు. అతనికి మన (మిగతా 22 వ పేజీలో)

# భగవద్విషయం వైరాగ్యం

# అవయవ విభూతి



**శ్రీమతి కొడకళ్ళ పద్మజ జ్యోతిర్మయి, చెన్నై.**

(గత సంచిక తరువాయి)

**భట్ట వేదాంతినౌ జంఘే ఊరూ యుగ్మంతు నంబులం।**
**కృష్ణం జాను యుగం చైవ లోకం శ్రీపాద పంకజం॥**

భట్ట వేదాంతినౌ జంఘే- భగవద్ రామానుజుల వారి కాలిపిక్కల స్థానంలో శ్రీపరాశ భట్టరు వారు, నంజీయర్ వారు వేంచేసి యుంటారుట! ఇంతకీ ఎవరీ ఈ పరాశర భట్టర్ వారు అంటే. కూరత్తాళ్వాన్ తిరుక్కుమారులు. శ్రీరంగాలయానికి పౌరోహిత్యము చేసిన వారగుట చేత వీరికి శ్రీరంగేశ పురోహితులు అన్న బిరుదు కలిగినది. వీరు అపారమైన పాండిత్యాన్ని కలిగిన వారు. అంత పాండిత్యం కలిగిన వీరు ఒకసారి పూరి బ్రాహ్మణ వేషంలో తిరు నారాయణపురం వేంచేస్తారు. అక్కడ మాధవ పెరుమాళ్ అనే పండితుని విశిష్టాద్వైత సిద్ధాంతంలోకి మార్చడానికి, అప్పటికే వేదాంతి అనే శ్రీ మాధవ పెరుమాళ్ మహా పండితులై తిరునారాయణపురంలో తదియారాధన కైంకర్యం చేసుకుంటూ ఉండేవారు. అపారమైన శిష్య బృందం వీరిది. అలాంటి ఈ వేదాంతితో వాదించి గెలిచి మరీ వారికి ఆచార్య స్థానాన్ని స్వీకరిస్తారు శ్రీపరాశరభట్టర్ వారు. శ్రీ మాధవ పెరుమాళ్ కూడా చాలా సంతోషంతో శ్రీరంగం వేంచేసి తమ సంపాదనంతా భట్టర్ వారి శ్రీపాదాలకు సమర్పించి సంసార విరోధులై సన్యాసాశ్రమాన్ని స్వీకరిస్తారు.

భట్టర్ వారే వీరికి నంజీయర్ అన్న తిరునామాన్ని ఉంచుతారు. వీరు వందకు పైగా భగవద్విషయ కాలక్షేపాలను అనుగ్రహించారు. ఎన్నో విశేష సంభాషణలు గురుశిష్యుల ఇరువురి మధ్య. ఒకసారి భట్టర్ వారు ఒక పాశురం చదువుతుంటే నంజీయర్ వారు "కంగలుం పగలుం" (7- 2- 9) లో ఉన్న పాశురంలో "ఎన్నుం ఎన్నుడై" అన్న పదాలను రెండింటినీ కలిపి చదువుతారట దాని అర్థం భగవంతుడే నా జీవనాధారం ఎందుకంటే లక్ష్మీదేవి ఆయన వక్షఃస్థలంలో వేంచేసి ఉన్నది కాబట్టి! లక్ష్మీనారాయణ సంబంధం విడదీయరానిదని ఆళ్వార్లు కృష్ణావతారంలోనే ఎందుకు ఎక్కువ అభినివేశాన్ని చెందారని అడుగుతారట ఓమారు. చూడండి! అందరం కొద్ది కాలం క్రితం జరిగిన దానినే గుర్తు పెట్టుకుంటాం కదా అలా ఆళ్వార్లు కూడా చివరిగా జరిగిన కృష్ణావతారాన్ని ఎక్కువ గుర్తు పెట్టుకుంటారుట. భట్టర్ వారిని "పెరియ తిరుముడిలో తిరుమంగై ఆళ్వార్లు వారు పరమపదానికి వేంచేసే ముందు "ఒరునల్" అన్న దశకంలో అందరి పెరుమాళ్లకు మంగళాశాసనం చేశారు ఎందుకు అని అడుగుతారట నంజీయర్ వారు. కొత్తగా పెళ్లయిన అమ్మాయి ఏ విధంగా అయితే తన పుట్టినింట చుట్టుపక్కల వారందరికీ చెప్పి తన భర్త దగ్గరకు వెళుతుందో అలాగే తిరుమంగై ఆళ్వార్లు కూడా అందరూ దివ్యదేశ పెరుమాళ్లకు మంగళాశాసనం కటాక్షించి తన భర్త వద్దకు అనగా పరమపదానికి వేంచేశారు అన్నారట భట్టర్ వారు. ఇలా ఎన్నో సన్నివేశాలు గురు శిష్యుల మధ్య ఉన్నాయి. కుసుమ శర సహితంగా అమర్చియుంచిన అంబుల పొద వలె జంటగా ఉన్నాయట పిక్కలు. ఇద్దరూ గొప్ప వేదాంతులు కనుక అపారమైన వేదాంత శాస్త్ర జ్ఞానం లభిస్తుందట రామానుజుల వారి కాలిపిక్కల స్థానం సేవిస్తే.

"ఊరూ యుగ్మంతు నంబులం"- శుద్ధ సాంప్రదాయ ప్రవర్తకత్వము ఇద్దరే ఇద్దరికి ఉన్నదట. అది నంజీయర్ వారికి. మరొకటి నంబిళ్ళై వారికి. ఎందుకు అంటే భట్టర్ వారి శ్రీపాదాలను ఆశ్రయించడం వలన నంజీయర్ వారికి వారి పాదాల ఆశ్రయించడం వలన నంబిళ్ళయి వారికి.

**"శ్రీవత్స చిహ్న భవతశ్చరణారవింద**
**సేవామృతైక రసికాన్ కరుణాసుపూర్ణాన్**
**భట్టార్య వర్య నిగమాంత మునీంద్రలోక**
**గుర్వాది దేశిక వరాన్ శరణం ప్రపద్యే"** నంబిళ్ళైగారి తిరునామం నంబూరి వరదాచార్యులు. తిరువాయిమొళికి ఈడు వ్యాఖ్యానాన్ని అనుగ్రహించారు. లోకాచార్యులు అనే బిరుదు వీరికి. అద్భుతమైన ఆళ్వార్లు అనుగ్రహించిన దివ్య ప్రబంధం యొక్క సూక్ష్మార్థాలు నంబిళ్ళై వారికి తప్ప

భగవద్విషయం వైరాగ్యం

# అవయవ విభూతి

వేరొకరికి తెలియవట! ఆ శ్రీ సూక్తులు అన్నీ వింటే వైరాగ్యం ఈ సంసారం లోనే కాదు ఆఖరికి మాకు పరమపదం కూడా వద్దు ఇక్కడే వీరి గోష్ఠి లోనే ఉండిపోతాం అని అనిపించేట్టుగా అనుగ్రహించే వారట కాలక్షేపాన్ని. ఈ మహానుభావులు వేంచేసి ఉంటారట రామానుజుల వారి తొడల భాగంలో. అతిశయము కలిగి ఉన్న అరటి బోదెలను ఏనుగులు తొండముతో జయించి ఎత్తగా మొదట పృథులములై చివరగా సన్ననివై బలిష్ఠంగా వెలుగుచున్న ఆ ఉరువులు సేవిస్తే అక్కడ నంబిళ్ళై గారు వేంచేసి ఉంటారట. కనుక మనకు ఉభయ వేదాంతాలు గోచరిస్తాయిట.

**కృష్ణం జాను యుగం చైవ** సంప్రదాయంలో మనకు మూడు రకములైన కైంకర్యములు చెబుతారు ప్రమాణ కైంకర్యం, ప్రమేయ కైంకర్యం, ప్రమాతృకైంకర్యం. ప్రమాణాలు అంటే శ్రీ కోశాలు (పుస్తకాలు) వాటిని సంరక్షించుకోవడం. చూడండి ఏదైనా సందేహం వచ్చి నప్పుడు దీనికి ప్రమాణం ఏమిటండీ అని అడుగుతాం! అలా అన్నమాట! నంబిళ్ళై శ్రీపాదాలను ఆశ్రయించిన వారిలో ప్రప్రథములు "శ్రీ వడక్కుతిరు వీధి పిళ్ళైగారు" నంబిళ్ళై వాగ్రూపమైన కాలక్షేపాలన్నింటినీ గ్రంథస్థం చేసిన ఆచార్యులు **తెళ్ళియదు ఆ నంబిళ్ళై శెప్పు నెఱిదన్నై వళ్ళల్ వడక్కు త్తిరువీధి ప్పిళ్ళై ఇన్ననాడరియ మాఱన్ మఱై ప్పొరుళై నన్గు ఉరైత్తదు ఈడు ముప్పత్తారాయిరం** అని కదా ఉపదేశ రత్నమాలలో శ్రీ మణవాళ మహామునులు అనుగ్రహించేరు. అలా నంబిళ్ళై గారి ఈడు ముప్పత్తాయిరాన్ని అంటే 30000 పాశుర వ్యాఖ్యానంతో లోకానికి అందించిన మహానుభావులు వీరు. **"శ్రీవైష్ణవనుక్కు నిలైనిన్ఱ ఆచార్యాభిమాన మొజియ మోపాయ మిల్లై. నిషైసిన్ఱ భాగవతాపచార మొజియ మోక్షపాయ యిల్లై"** ఒక వైష్ణవునికి ఆచార్యాభిమానాన్ని మించిన మోక్షోపాయము లేదు. భాగవతాపచారాన్ని మించిన మోక్ష విరోధి లేదు. అన్న తమ ఆచార్యులైన నంబిళ్ళైగారి శ్రీసూక్తులును ఎల్లప్పుడూ తలిచేవారట! ఈ మహాను భావులు రామానుజులవారి జానువులలో వేంచేసి ఉంటారు కాబట్టి ఆ జానువులను సేవిస్తే మనకు కూడా శ్రీవడక్కుత్తిరు వీధి పిళ్ళై గారు చేసినటువంటి ప్రమాణ కైంకర్యం లభిస్తుందిట!.

శ్రీరామాయణంలో ఉపకథలు

# శ్రీరాముని శరణాగత వత్సలత్వం

(20 వ పేజీ తరువాయి) చేతనైనంత సహాయం చేయాలి అని అనుకుంది. తాను మంటల్లో దూకి తనను ఆ వేటగాడికి ఆహారంగా సమర్పించుకుంది. అని ఈ కథను సుగ్రీవుడికి చెప్పి రాముడు చెప్పాడు. సుగ్రీవా ఆ కథలో వేటగాడు రావణుడు, ఆడ పక్షి సీత, మగ పక్షి నేను. ఒకవేళ రావణుడు సీతను చంపి ఉంటే రావణుడే మళ్ళీ వస్తే నేను ఆత్మ త్యాగం చేసి వాడికి ఆకలి తీరుస్తే లోకం ఏమంటుంది? ఈ రాముడు ఒక పక్షి చేసిన పని చేశాడు, అంత కంటే గొప్పగా ఏం చేసాడు అంటుంది.

ఆ కథలో వేటగాడు ఆడ పక్షి ని చంపాడు. ఇక్కడ సీతను రావణుడు చంపలేదు, చెరలో పెట్టాడు. కథలో మళ్ళీ ఆ వేటగాడే వచ్చాడు. ఇక్కడ వచ్చింది రావణుడు కాదు, అతని తమ్ముడు, మంచివాడు. వేటగాడు శరణాగతి కోరలేదు. ఇక్కడ విభీషణుడు శరణు కోరాడు. మగ పక్షి వేటగాడు అడగకుండానే ఆత్మ త్యాగం చేసి వేటగాడి కడుపు నింపింది. ఇక్కడ నేను ఆత్మ త్యాగం చేయాల్సిన అవసరం లేదు, కేవలం అభయం ఇస్తే చాలు. అది కూడా ఒక పావురం చేసిన పని కంటే తక్కువ. అంత మాత్రం కూడా చేయవద్దంటావా? అన్నాడు. వెంటనే సుగ్రీవుడు రాముడి పాదాల మీద పడి 'రామా నీకు చెప్పేవాడినా? ఏదో నీ మీద ప్రేమతో, శత్రు శిబిరం నుంచి వచ్చిన వాడిని చూసి ఏదో అన్నాను. నీకు తెలియని ధర్మం ఉంటుందా? రామో విగ్రహవాన్ ధర్మః' అని కదా అంటారు అన్నాడు. రాముడి ఆజ్ఞ మేరకు సుగ్రీవుడు తానే ఎదురు వెళ్ళి విభీషణుడిని తీసుకువచ్చాడు అని చరిత్ర. ★



శ్రీమన్నారాయణస్వామిని కీర్తించే గ్రంథా లెన్నో ఉన్నాయి. భక్తిపరిమళాలు వెదజల్లే సుమమాలిక మన 'శ్రీసన్నిధానం.' ఆధ్యాత్మిక చింతనను ప్రోదిచేయటమే కాకుండా ఆ మార్గంలో అన్ని విషయాలనూ కలిపి భాగవతులకు అందిస్తూ తరింప చేస్తూంది. భక్తిపారమ్యంలో ముంచే ఈ బాలిక రెండవ జన్మదినం వైభవంగా జరుపుకుని, మూడవ కొత్త సంవత్సరం లోకి అడుగు పెట్టింది. బుడిబుడి నడకలతో ముందుకు సాగుతూ భక్తజనసందోహానికి మార్గదర్శనం చేయాలని కోరుతూ...

**శ్రీమతి తిరుమల నీరజ, హైదరాబాద్**

# అంతా రామమయం...



శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి

అయోధ్యలో రామయ్య కొలువైన వేళ అంతా రామమయం! జగమంతా రామమయం! యావత్ ప్రపంచం ఉత్కంఠతతో వీక్షిస్తున్న వేళ అంతా రామమయం! కేవలం 14 సంవత్సరాలు వనవాసం చేసి అయోధ్యకు ఆనాడు రామయ్య తిరిగివస్తే నేడు మన రామ్‌లల్లా 500 సంవత్సరాలకు మనను చిరునవ్వుతో పలకరించడానికి వచ్చాడు. న్యాయస్థానాల్లో దశాబ్దాల తరబడి పోరాటం జరిగాక, కోర్టు తీర్పు ఇచ్చాక శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఏర్పాటు జరిగింది. అయోధ్య రామ మందిరం నిర్మాణం విషయంలో ఆద్యంతం కథలు కథలుగా చెప్పుకునే విధంగా సంఘటనలు జరిగాయి. తొలుత పేర్కొన్న వివాదాస్పద స్థలంలో 1949 సంవత్సరం ప్రాంతంలో బాల శ్రీరాముని విగ్రహం తవ్వకాల్లో లభించింది. రామ మందిర నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. అయితే ప్రస్తుత రామ మందిర నిర్మాణ డిజైను 1989లో జరిగినట్టు బోగట్టా. ఇది అప్పుడు ఎలా సాధ్యం? వివాదాస్పద స్థలం కదా అన్న సందేహం కలగవచ్చు. విశ్వహిందూ పరిషత్ విజ్ఞాపన మేరకు చంద్రకాంత్ భాయి సోంపుర అనే ఆర్కిటెక్ట్ అయోధ్యకు భక్తుడిలా వెళ్లి కట్టుదిట్టమైన భద్రత కలిగిన ప్రదేశం వీక్షించారు. అలా కంటి చూపుతోనే ఆలయ నమూనాకు నాడు రూపకల్పన చేశారు. దీనికి మార్పులు చేర్పులు జరిగాయి. ఒకవైపు వివాదాస్పద స్థలం విషయంలో న్యాయపోరాటం జరుగుతున్న వేళ రామభక్తులు కరసేవకులు జాప్యం భరించలేక సహనం కోల్పోయారు. ఇది మరింత సున్నితమైన వ్యవహారం అయ్యింది.

కోర్టు తీర్పు వెలువడిన తర్వాత వెండి ఇటుకతో మోడీ చేతుల మీదుగానే శంకుస్థాపన జరిగింది. అనంతరం మందిర నిర్మాణం పుంజుకుంది. ముఖద్వారం వద్ద గరుత్మంతుడు హనుమంతుడు ఉండేలా తీర్చిదిద్దారు. ఏమిటంటే సింహాలు ఏనుగులు కూడా ఉండేలా డిజైన్ చేశారు. వాస్తు శాస్త్రవేత్తలను శిల్ప శాస్త్రవేత్తలను ఆలయ నిర్మాణ శాస్త్రవేత్తలను సమన్వయం చేసి తత్ సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రతి ఒక్క నిర్మాణ అంశాన్ని కూలంకషంగా చర్చించాకే ఖరారు చేశారు. రామ మందిరం కోసం 70 ఎకరాల స్థలం ఉంది కానీ ఇందులో 57 వేల నాలుగు వందల చదరపు అడుగులు మాత్రమే మందిర నిర్మాణానికి కేటాయించారు. ఆలయ నిర్మాణానికి ముఖ్యంగా గులాబీ రంగు రాయిని ఉపయోగించారు. దీనిని రాజస్థాన్లోని బన్సీ పహాడ్ నుంచి ప్రత్యేకంగా తరలించారు. తెలంగాణ కర్ణాటక నుంచి తెప్పించిన గ్రానైట్ కూడా ఉపయోగించారు. ఆలయ నిర్మాణంలో శిల్ప కళకు ప్రాధాన్యం ఇస్తూ తమిళనాడు ఒడిశా యూపీ రాజస్థాన్ నుంచి శిల్పులను రప్పించారు. గర్భగుడిలోని మూలమూర్తి కోసం మైసూర్ సమీపంలోని కృష్ణశిలతో రూపొందించారు. ఈ శిల్పాన్ని అరుణ్ యోగి రాజ్ మలిచారు. ఇందుకోసం మౌన దీక్ష వహిస్తూ సుమారు ఆరు నెలలకు పైగా కృషి చేశారు. ప్రాణ ప్రతిష్ఠ జరిగాక రామ్‌లల్లాను తిలకించిన వారంతా చిరునవ్వులు చిందే ఇంత చక్కని శిల్పం ఎక్కడి నుంచి వచ్చింది అనుకున్నారు. అప్పుడు అరుణ్ యోగి రాజ్ గురించి సందర్శకులు తెలుసుకున్నారు. ప్రసిద్ధ శిల్ప వంశానికి చెందిన అరుణ్ చిన్న వయసు నుంచి శిల్పాలు చెక్కడంలో ప్రావీణ్యం సంపాదించారు.

ఆలయ ప్రధాన ద్వారం దగ్గరకు చేరాలంటే 32 మెట్లు ఎక్కి సింహద్వారం ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. గర్భగుడి సమీపించడానికి నృత్య మండపం, రంగ మండపం, సభా మంటపం, కీర్తన మంటపాల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. వీటిలో సాంప్రదాయ శిల్పకళా శిల్పాలు స్తంభాలకు దర్శనమిస్తాయి. ఇదిలా ఉంటే మండపాల చుట్టూ 732 మీటర్ల పొడవు, 14 అడుగుల ఎత్తుతో ఒక ప్రకారం దర్శనమిస్తుంది. మందిరంలోని మూడు అంతస్తుల నిర్మాణాలను పరిశీలిస్తే కడు రమ్యంగా కనిపిస్తాయి. రామ కథ ఘట్టాలు శిల్పాకృతిలో దృశ్యంగా, మొదటి అంతస్తులు రాముని దర్బార్ దర్శనమిస్తుంది. గర్భగుడిలో బాల రూపంలో రామ్‌లల్లా ప్రధాన పీఠంపై వేంచేసి ఉంటాడు. దిగువ ఉత్సవమూర్తిగా 1949లో త్రవ్వకాల్లో లభించిన రామ్‌లల్లా

దర్శనమిస్తారు. మూలమూర్తిని సుమారు 35 అడుగుల నుంచి దర్శించే వీలుండగా ఉత్సవ మూర్తిని దర్శించాలంటే 18 అడుగులు దూరం నుంచి తిలకించవచ్చు

ఇక ఉప ఆలయాలు మందిరంలోని నాలుగు మూలల్లో సూర్యుడు, గణపతి శివుడి ఆలయాలు, ఉత్తరంలో అన్నపూర్ణ ఆలయం, దక్షిణంలో హనుమంతుడు కొలువై ఉన్నాడు చారిత్రక ఆధారాల ప్రకారం సీతా కూంపు కూడా ఉంది. ఇది బావి అన్నమాట! వాల్మీకి, వశిష్ట మహర్షి, విశ్వామిత్ర మహర్షి శబరిమాత దేవి, అహల్య ఆలయాలు కూడా దర్శనం ఇస్తాయి అంతేకాకుండా శివుని పురాతన మందిరం, జటాయువును కూడా సందర్శించవచ్చు.

ఇంత అత్యద్భుత నిర్మాణంలో ఎక్కడ ఇనుము వాడలేదు ప్రాణ ప్రతిష్ఠ జరిగిన 2024 జనవరి 22 సమయానికల్లా దాదాపు అన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి. చుట్టూ పచ్చిక బయలు మొక్కలు ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. ప్రాణ ప్రతిష్ఠ జరిగిన మరునాడు నుంచే ప్రజలు తండోపతండాలుగా రామ్‌లల్లాను దర్శించుకోవడానికి వస్తున్నారు. మొక్కులు చెల్లించుకొని, కానుకలు సమర్పించడానికి వస్తున్నారు.

అయోధ్యలో అడుగుపెట్టిన క్షణం నుంచి జైశ్రీరామ్ నినాదాలు వినిపిస్తాయి ప్రతి వీధులు అలంకరించినట్లు కనిపిస్తాయి. రామాయణంల్లోని ప్రధాన ఘట్టాల మూర్తులు దర్శనమిస్తాయి. ఆధ్యాత్మిక వాతావరణం అడుగడుగునా కనిపిస్తుంది. సీతమ్మ జన్మస్థలం నేపాల్ జనకపురి నుంచి బాల రామునికి పాదరక్షలు ఎన్నో కానుకలు వచ్చాయి. ఇక్కడ ప్రత్యేకమైన ఆకర్షణ ఏమిటంటే 200 కిలోల గంట ఒక వెయ్యి ఒక వంద కిలోల భారీ దీపం, హైదరాబాద్ నుంచి బంగారు పాదుకలు, 10 అడుగుల ఎత్తయిన భారీ తాళం రాములవారికి అందిన కానుకల్లో ఉన్నాయి. ప్రపంచంలోని ఎనిమిది దేశాలలో సమయాన్ని సూచించే విధంగా రూపొందించిన గడియారం కూడా స్వామివారికి కానుకగా లభించింది. ఇలా చెప్పుకుంటూ వెళితే ఎన్నో కానుకలు! అయోధ్యవీధులన్నీ ఆధ్యాత్మిక శోభతో కళకళ లాడుతున్నాయి. ప్రాణ ప్రతిష్ఠ మహెూత్సవానికి విచ్చేసిన ఎందరో ప్రముఖులు విచ్చేశారు. వీరిలో సినీనటులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, ఋషులు ఆధ్యాత్మికవేత్తలు ఆచార్య పురుషులు ఎందరో ఇలా చెప్పుకుంటూ వెళితే అంతా రామమయం! కేవలం అయోధ్య లోనే కాదు జగమంతా రామమయం!

## భరన్యాసము భగవంతుని పైనే భారము...

(15 వ పేజీ తరువాయి) చెందిన దానివి అని అంటుంది. అతని మీద పూర్తి నమ్మకము ఏర్పడేట్లు చేస్తుంది. ఇలా అనన్యార్హ శేషత్వాన్ని బలపరుస్తుంది. నాయకునికి నాయికకు వున్న సంబంధాన్ని ఎరుకబరుస్తుంది. అది తిరుమంత్రములో ఓం కారమైన ప్రణవము చేసేపని. తల్లిగా 7 పదిగములు పాడినారు నమ్మాళ్వార్లు. తల్లిచేసేపని ఏమిటి? నీవు నాయకునిగా ఒకరిని వరిస్తే, నీఅంతట నీవుగా అతనిని దరిచేరకూడదు. నీవు ఎట్టి పరిస్థితిలో వున్నా నిన్ను రక్షించుకొని తన దానినిగా చేసుకొనే బాధ్యత అతనిదే నీది కాదు. ఆ భారమతనిదే అనే ధైర్యముతో వుండాలి. అతనిని సందేహ పడకూడదు. ఉన్ మనత్తాల్, ఎన్ నినైన్దిరున్దాయ్ ఇడవెండై ఎండైపిరానే.. ఇలా పరమాత్మ నిన్నురక్షించాలి. నీవు ధృఢఅధ్యవసాయముతో వేచివుండాలి. ధైర్యము కలిగి వుండడాన్ని తల్లి నేర్పుతుంది. ఇది నమః ద్వారా తేట తెల్ల మవుతుంది.(తలైవి) నాయిక, (మగళ్) కూతురు. మరి తల్లికి సమాధానం కూతురెలా చెప్తుంది? నాయకుని చేరాలని నాయికకు ఎంత తాపత్రయ ముంటుంది. అంటూ ప్రాప్యములో తపన వుండదా? అని నిలదీస్తుంది. ఆ త్వర తపన అది నారాయణాయ అనే తిరుమంత్ర పదమును విశదపరుస్తుంది. తోళ్ పాటలు మూడింటిలో ఓం కారార్థము అహం నమమ శ్రీపతేరేవ తెలియబరచబడింది. తాయ్ పాటలు ఏడింటిలో నమః అంతరార్థము, మద్రక్షణపరం నమమ శ్రీపతేరేవ తెలియపరుస్తుంది. మగళ్ పాటలు పదిహేడింటిలో నారాయణాయ మద్రక్షణ ఫలం శ్రీపతే రేవ అని తెలియ పరుస్తుంది.

(ఇవి ఆచార్యహృదయ మనే రహస్య గ్రంథములో పిళ్ళైలోకాచార్యుల సోదరుడు స్వామి అళగియ పెరుమాళ్ నాయనార్ 133వ చూర్ణికలో వివరించారు. సంబంధ వుపాయ ఫలంగళిల్ ఉణర్త్తి, ప్రజ్ఞవస్తైగళుక్కు, తోళి, తాయార్, మగళ్, ఎన్రు పేర్! అని) ఒకే విషయాన్ని మన పూర్వాచార్యులందరు, ఎలా ఒకే భావనలో వివరిస్తున్నారో చాలా ఆశ్చర్యముగా వుంటుంది. ప్రాప్తావుం, ప్రాపకనుం, ప్రాప్తిక్కు వుగప్పానుం అవనుం అవనే! ప్రాప్తా పొందేవాడు. శ్రీపతే రేవ ప్రాపకన్ పొందే వుపాయము, శ్రీపతే రేవ ప్రాప్తి పరమాత్మ ప్రాప్తికి ఆనందపడేవాడు! శ్రీపతేరేవ. (సశేషం)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

( 11 వ పేజీ తరువాయి )

**శ్లో॥ చరణాత్కర్ణ పర్యన్తం దండం సరళ వంశజం।**
**పూర్వతః పశ్చిమాం యావదుత్తరాందక్షిణాంతతః॥**
**తయోశ్చచండ యోర్యోగం కృత్వా భూమౌ విలిఖ్యతాం।**
**అష్టభిశ్చ హరేద్భాగం శేషాంకేన ఫలం వదేత్।**
**ప్రథమం రజకస్థానం చంద్రవత్ఫల మాదిశేత్।**
**ద్వితీయం చర్మకారస్య క్షుత్పిపాసా కులో గృహి।**
**తృతీయం బ్రహ్మణస్థానం జనోద్వాసకరం మహేత్।**
**చతుర్థం శూద్రకస్థానం ధనధాన్య ప్రదాయకం।**
**పంచమం యోగినః స్థానం మహదౌ దాస్యకారకం।**
**షష్ఠంతు గోపకస్థానం సర్వసిద్ధి ప్రదాయకం।**
**సప్తమం క్షత్రియస్థానం సదాయుద్ధకరం నృణాం।**
**అష్టమం చక్రిణః స్థానం మరణం రోగ కారకం॥**


గృహము నిర్మించు యజమాని కుడిపాదము నుండి కుడి చెవి వఱకుగల యెత్తును వంకర లేని వెదురు కర్రతో కొలిచి తీసుకొనవలయును.

గృహము నిర్మించనున్న స్థలము యొక్క పొడవు వెడల్పు లను రెండింటిని ఆకర్రతో ఎన్ని కర్రలున్నవో కొలిచి ఆసంఖ్యను 8 చే భాగించగా 1 శేషమైన రజకస్థానమని యిందులో గృహనిర్మాణము జరిపిన చంద్రునితో సమానమైన ఫలము కలుగును. అనగా చంద్రుని వృద్ధి క్షయములు గలుగు నటుల గృహయజమానికి ఐశ్వర్యము వృద్ధి క్షయములుండును, 2 శేషమయిన చర్మకారక స్థానమందురు. గృహయజమానికి క్షుత్పిపాసాది వ్యాకులత్వమును కలుగ చేయును. 3 శేషమయిన బ్రాహ్మణస్థాన మందురు. యిది యజమానికి ఉద్వాసన కలుగచేయును. 4 శేషమైన శూద్రస్థానమందురు. యిది యజమానికి ఎల్లప్పుడు ధన ధాన్యములనొసంగును. 5 శేషమయిన యోగుల స్థానమందురు. యిది యజమానికి గొప్ప ఉదాసీనత్వమును కల్గించును. 6 శేషమయిన గోపస్థానమనియు యిది యజమానికి సంపూర్ణ సిద్ధుల నిచ్చునదియు. 7 శేషమైన క్షత్రియ స్థానమనియు యిది యజమానికి ఎల్లప్పుడు విరోధములను కల్గించును. 8 శేషమయిన కుంభాకార స్థానమందురు. యిది యజమానికి మృత్యువును రోగమును కల్గించును.

**(వచ్చే సంచికలో మరి కొన్ని విశేషాలు)**

# పుస్తక పరిచయం

సాంప్రదాయానుసారముగా విష్ణు సంబంధ దేవాలయ ఆరాధనల్లో పాంచరాత్రాగమ విధివిధానాలను పండితాచార్య పరిష్కృతంగా ఆచరిస్తారు. అటువంటి విశేషాలను సులభ గ్రాహ్యంగా అందించే గ్రంథాల




ఆవశ్యకత ఎంతో ఉంది. నిత్యార్చన, ఆంధ్ర పాంచరాత్ర ప్రయోగ విజ్ఞానము అనే ఈ పుస్తకము దేవాలయ ఆరాధనలో ముఖ్య విషయాలను తెలియ జేస్తున్నది. ఎన్నో ప్రాచీన గ్రంథాలలో ప్రమాణా లను వివరిస్తూ విశేషా లను పొందుపరిచారు. పంచకాల విధి, నిత్యార్చన లఘు నిత్యార్చన, నిత్య కర్మానుష్ఠాన, నిత్యార్చన గ్రంథముల పరిశీలన పట్టికలు ఇత్యాదులు సంక్షిప్తంగా ఇవ్వబడ్డాయి.




260 పేజీలతో తిరుమల తిరుపతి దేవస్థానముల వారి సౌజన్యం తో ఆంధ్ర పాంచరాత్ర ప్రచురణలు కొంతమూరు రాజమహేంద్రి 2 ద్వారా 2019లో ప్రచురించబడింది. గ్రంథ సంపాదకులు డా. రేజేటి వేంకట వేణుగోపాల చార్యులు ఎన్నో ఉపయుక్త గ్రంథముల జాబితాలు కూడా ఈ పుస్తకంలో ఇవ్వబడ్డాయి. పుస్తకం మూల్యము 250/- లభించు ఫోన్ నెంబర్ 9346360891.

## మనం ఒక్క అడుగు

# భగవంతుని వైపు వేస్తే!...



శ్రీమాన్ శ్రీ డా. వోలేటి రవి కుమారాచార్య, హైదరాబాద్

భగవంతునిపై మనకు భక్తిని కలిగించటానికి పై సామెతను మన పెద్దలు తరచుగా అంటూ ఉండటాన్ని చాలా మందిమి విన్నవాళ్ళమే. అయితే, దీనికిగల బలమైన వృత్తాంతము ఒకటి మీ అందరితో పంచుకునే ప్రయత్నం.

జనవరి 22 వ తేదీ 2024 యావత్ భారతదేశం శ్రీరామ నామంతో, కీర్తనలతో, భజనలతో, శ్రీసీతారామ కళ్యాణములతో, అన్నదానములతో, శ్రీరామాయణ పారాయణా క్రతువులతో పులకించిపోయింది. దానికి కారణం, త్రేతాయుగం నాటివాడైనప్పటికీ శ్రీరామునిపై మనకున్న అత్యంత పవిత్రమైన ప్రేమ. అట్టి ప్రేమకే భక్తి అని పేరు **భక్తిస్తు ప్రీతి విశేషః**. అట్టి శ్రీరాముని చరిత్రలో, శ్రీరామాయణంలో ఒక సన్నివేశాన్ని గుర్తుచేసుకుంటూ పై సామెత పట్ల విశ్వాసాన్ని మరింత పెంచుకునే ప్రయత్నం చేద్దాం! ఆ శ్రీరామునికి మరింత దగ్గరయ్యే మార్గంలో పయనిద్దాం!

కైకేయి వరముల కారణముగా శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై అడవులకు వెళ్ళునపుడు వారందరిని సుమంత్రుడు తన రథములో అధిరోహింపచేసి శృంగిబేరపురంలోని గంగాతీరం వద్ద వదులుటకై ఉపక్రమిస్తుండగా, శ్రీరాముని రాకను తెలుసుకున్నవాడైన నిషాదాధిపతి (వేటగాళ్లకు అధిపతి) అయిన గుహుడు గంగాతీరం నుండి శ్రీరాముని ఆహ్వానించుటకై ఎదురుగా వస్తాడు. అలా తన దగ్గరకు వస్తున్న గుహుడిని చూచి లక్ష్మణునితో కూడా శ్రీరాముడు లేచి ఎదురుగా వచ్చి గుహుడిని కలుస్తాడు. మిక్కిలిగా తపించినవాడైన గుహుడు శ్రీరాముడిని కౌగిలించుకుని ఓ శ్రీరామచంద్రా నీకు అయోధ్య ఎట్లో ఈ నగరము (శృంగిబేరపురము) కూడా అట్లే. నీకొరకు నేను ఏమి చేయవలెను ఆజ్ఞాపింపుము. అని అనుచూ విధవిధములైన ఆహార పదార్థాలు, నెయ్యి, తేనె మొదలుగునవి ఎన్నో శ్రీరామునికి సమర్పిస్తాడు.

అట్టి సమయంలో శ్రీరాముడు సంతోషించి, "ఓ గుహా! నీవు నాకొరకు ప్రేమతో ఏవైతే బాగుగా ఏర్పాట్లు చేశావో వాటన్నిటినీ నేను అనుమతించుచున్నాను. కానీ ప్రస్తుతము నీవిచ్చినవి పుచ్చుకొను స్థితిలో నేను లేను. నన్ను కుశలను (దర్భలను), నారబట్టలను, జింక చర్మము ధరించిన వానినిగానూ, పండ్లను దుంపలను తిను వానినిగానూ, అరణ్యమునందు సావధానునిగానూ ఒక్క మాటలో చెప్పాలంటే తాపసునిగా తెలుసుకొనుము. నా పరివారమునకు, గుఱ్ఱములకు సపర్యలు కావింపుము". అని చెప్పి **అర్చితాశ్చైవ హృష్టాశ్చ భవతా సర్వదా వయం। పద్భ్యామభిగమాచ్చైవ స్నేహసందర్శనేన చ॥** (అయోధ్యా కాండ 50 వ సర్గ) అని అంటాడు. దీని అర్థం, ఓ గుహా! నీవు పాదములతో నడచి వచ్చి నన్ను కలిసావు, నాపై అత్యంత స్నేహభావాన్ని చూపించావు. వీటి ద్వారా మేము పూజింపబడిన వారమై సంతోషించితిమి అని.

ఇక్కడ మనము గమనించాల్సిన విషయాలు ఏమిటంటే, గుహుని విషయమై శ్రీరాముడు లక్ష్మణునితో కూడి ఎదురు వెళ్ళటం అనేది గుహుని యొక్క స్థానం లక్ష్మణుని స్థానంతో సమానమైనది అనే భావాన్ని సూచిస్తుంది. (సోదర భావం). అంతమాత్రమే కాదు శ్రీరాముడు గుహుడిని చూపించి లక్ష్మణునితో "ఆత్మసమ: సఖా" అని అంటాడు. అంటే శ్రీరామునికి గుహుడు అత్యంత ప్రియమైన మిత్రుడు అని నీకు సోదరునితో సమానమని చెప్తాడు.

జంతువులని వేటాడుతూ, గంగా తీరంలో పడవలు నడుపుతూ ఉండే గుహుడు ఎలా ఉంటాడో మనం ఊహించవచ్చు. నాగరికత లేని కారణంగా సరియైన దుస్తులు ధరించే అవకాశం లేదు. పడవలు నడుపుతూ గంగా తీరంలో గడిపేవాడు కాబట్టి మోకాలి వరకు బురద ఉంటుంది. అంటే భౌతికంగా చూచినా కూడా ఏమాత్రం శుచి భావన కలిగే అవకాశం లేదు. కానీ శ్రీరాముడు అట్టి గుహుణ్ణి "ఆత్మసమ: సఖా" అని అన్నాడు. దానికి కారణం భగవంతుడైన శ్రీరాముడిపై గుహుడికి ఉన్న అత్యంత ప్రీతి (భక్తి). అంతకుమించి శ్రీరాముని యొక్క సౌశీల్యము అనే గుణము.

కులమును బట్టి కానీ, ధనమును బట్టి కానీ, విద్యను బట్టి

కానీ తనతో ఏమాత్రమూ సరితూగని వారితో అరమరికలు (హెచ్చు తగ్గులు అనే భావన) లేకుండా ఉండటమే సౌశీల్యము కదా! అట్టి సౌశీల్య గుణమే గుహుడు నాలుగు అడుగులు వేసి శ్రీరాముడుకి స్వాగతం పలకటానికి వచ్చినపుడు - ఆహా గుహా! నన్ను కలవటం కొరకు నడుచుకుంటూ వచ్చావా అనేట్లు చేసింది... నాలుగు అడుగులు వేయటానికి కారో, బస్సో, రైలో, విమానమో కావాలా? కాళ్లతో నడిస్తే సరిపోతుంది. అదేమైనా సాహసమైన కార్యమా? అంటే మిక్కిలి ప్రీతితో గుహుడు వేసిన అడుగులు శ్రీరాముణ్ణి సహింపచేయలేకపోయాయి. ప్రేమతో ఆలింగనం చేసేలా చేసిందని ఆ ప్రీతి. అంతకు మించి సాక్షాత్ పరబ్రహ్మ అయిన శ్రీరామునికి తమ్ముడు అనే స్థానాన్ని కట్టబెట్టింది.

చూచారు కదా, మనసా వాచా కర్మణా శ్రీరాముడు గుహుని విషయంలో ప్రవర్తించిన తీరుని తెలుసుకున్నపుడు మనం **ఒక్క అడుగు భగవంతుడి వైపు వేస్తే భగవంతుడు పది అడుగులు మనవైపు వేస్తాడు** అనే భావన మనకు ఏ సందేహము లేకుండా నిశ్చితమై ఉండి ఆ శ్రీరాముని విషయంలో మన ప్రీతిని (భక్తిని) ద్విగుణీకృతం చేయగలదు.

**సర్వే సర్వత్ర శ్రీరామవిషయైక భక్తి సిద్ధిరస్తు**
**శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః** ★

## ముక్తి క్షేత్రాలలో మొదటిదైన అయోధ్యలో బాలరాముని ప్రతిష్ట చేసుకున్న శుభ సందర్భంగా



ధర్మోదదాతి ధనమక్షయ ముత్తమంతు
ధర్మోదదాతి పదమక్షయ మచ్యుతస్య
ధర్మోదదాతి విమలాంధియ మాత్మ సౌఖ్యమ్
ధర్మోదదాతి బహుపుత్ర యశాంసి నృణాం

ధర్మము నాశరహితమైన ధనాన్ని ఇస్తుంది. పరమాత్మ సన్నిధి ప్రసాదిస్తుంది. నిర్మలమైన బుద్ధిని, నిజమైన సుఖాన్ని సత్సంతాన సౌభాగ్యాలని, కీర్తిప్రతిష్ఠలని, మానవులకు ప్రసాదించేది ధర్మమే. సమ ప్రాణులకు సద్గతిని ప్రసాదించే ధర్మము పురుషార్థాలలో ప్రధానమైన ధర్మము వల్లే అర్ధ కామాలు సిద్ధిస్తాయి. కాబట్టి బుద్ధిమంతులు సర్వవిధాల ధర్మాచరణకే సిద్ధం కావాలి.

**మనస్విని ప్రచురణలు. కోయిల్ కందాడై వేంకట లక్ష్మణ స్వామి. విశ్రాంత ఆంధ్ర ఉపాధ్యాయులు.భాగ్యనగరం,** ★

# భజ రామచంద్రం



**శ్రీమాన్ శ్రీ చిలకమర్తి కృష్ణమాచార్యులు**

**రావణాంతమునకు నాడు రవి కులమున**
**జననమందెనయోధ్యను జనులుమెచ్చ**
**కుత్సితాంతముజేయుచు కూర్మినేడు**
**పొందెరాముడయోధ్యను పొలుపుమీర**

శ్రీరామచంద్రమవనీశసమర్చితాంఘ్రిం
సీతామనోజ్ఞమధుపంమహనీయమూర్తిం
పుంభావధర్మమసమాన వ్రతైక దీక్షం
వందే సురారిగణ శోషణమాదిదేవం
సుగ్రీవ మానస విషాద విభేదమంత్రం
సామీరి మానస ప్రహర్ష విలాస హేలం
సౌమిత్రి మానస ప్రభుత్వ విరాజ మానం
రామం విభీషణ మనోజ్ఞ రవిం భజేహం.
సర్వాపరాధశమనం భవతారకాస్త్రం
సద్యప్రసాదమనిమేషవికాసమూలం
సంతోషదాయకమపార కృపానిధిత్వం
రామం భజే భరతకీర్తిత దివ్యనామం.
సంపూర్ణ మానవ వికాస నిరూపయంతం
సంకాశ పుణ్యమనుభూత విశిష్టశీలం
సంపూజితాంఘ్రియుగళం మునిభిర్విశేషం
సంపీడనార్తివిదళం భజ రామచంద్రం
రాజీవనేత్రమనుగుణ్య కటాక్షవీక్షం
స్వర్భూరుహేవవరదాయకమబ్జనాభం
సంజాతధీరగుణ శోభితభవ్యకీర్తిం
తేజోప్రభావశరధిం భజరామచంద్రం
మౌనీశ్వరాళి హృదయేషుసమ్మోహ భావం
సూనాస్త్రపాణిజనకంకమనీయ గాత్రం
జ్ఞానప్రదాతమినతేజమనంతరూపం
రామం మహీజన ప్రదోషహరం నమామి
శ్రీయోగదాయకమశేషశుభానివేశం
మాయావిభేదన పూర్వప్రకాశ దీప్తం
ఛాయోసమానమతిశీతలదాయినం తం
ధ్యాయేత్సదా శుభ రఘూద్వహపాద పద్మం ★

# అయోధ్య బాల శ్రీ రాముని ప్రతిష్ఠా మహోత్సవం



## ఆధ్యాత్మిక వార్తలు








### సమతా కుంభ్ 2024

ముచ్చింతల్ దివ్య సాకేతంలో గల 108 దివ్య దేశాల ద్వితీయ బ్రహ్మోత్సవములు 20-02-2024 నుండి 01-03-2024 వరకు వైభవంగా జరగనున్నాయి.

### గోదా రంగనాయక కళ్యాణం

అనేక దేవాలయాల్లో ధనుర్మాస వ్రతోత్సవాలు ముగిసిన సందర్భంగా గోదా రంగనాయక కళ్యాణాలు వైభవంగా నిర్వహించారు.

